నవశక్తి

Vol. 1, no. 41

(Oct. 5, 1938)

బెజవాడ, 1938

Record no. 682

Navaśakti

Vol. 1, no. 41

(Oct. 5, 1938)

Bejavāḍa, 1938

Record no. 682

యుద్ధవార్తా సంచిక Regd. No. M. 3824

నవశక్తి

ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ పత్రిక

సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు). కంభంపాటి సత్యనారాయణ. పుచ్చలపల్లి సుందరయ్య. తుమ్మల వెంకట రామయ్య.

సంపుటం 1 | బుధవారము 5-10-38 బెజవాడ | సంచిక 41

గొడ్డలి పెట్టు



నవశక్తి

చందా వివరాలు

సంవత్సర చందా	రూ 3-0-0
అర్ధసంవత్సర చందా	1-10-0
విడిప్రతి	0-1-0

* * *

అడ్వర్టైజుమెంటు రేటులు

"కాలం" వెడల్పు 2" (2 అంగుళాలు) కాలంలో 1" మొదలు 20" వరకు ప్రతి

అంగుళానికి రూ.	0-6-0
20"-100" వరకు ..	0-4-0
100" పైగా ..	0-3-0
పాతిక పేజీకి	3-0-0
సగము పేజీకి	6-0-0
ఒక పేజీ మొదలు 15 పేజీల వరకు పేజీ ఒకటికి	10-0-0
15 పేజీలకు పైగా పేజీ 1కి	7-8-0

ఈ వరకు అంగీకరించిన కంట్రాక్టులకు ఈ రేట్లు వర్తించవు.

ఈ రేట్లలో కన్సెషన్ను, కమిషన్ను ఏమీ ఉండవు.

* * *

చందాదారులను చేర్పించాలి:

సెప్టెంబర్‌లో ఈ క్రింది విధంగా జేర్పించాలని క్రొత్తగా మరో లిస్టు ఇచ్చినాం. ఈ "కోటా"లు పూర్తి అయేటట్లు పార్టీ సభ్యులు, సోషలిస్టు అభిమానులు, ప్రజాసామాన్యము పని చేస్తారని ఆశిస్తున్నాం.

ముఖ్యంగా పార్టీ సభ్యులు తీవ్రంగా పనిచేసి 'కోటా' పూర్తి చేస్తారని నమ్ముతున్నాం.

సెప్టెంబర్ నెల

	కోటా	చేర్పించినది
విశాఖపట్టణము	10	3
తూ. గోదావరి	75	7
ప. గోదావరి	90	43
కృష్ణా జిల్లా	100	71
గుంటూరు	60	10
నెల్లూరు	50	16
రాయలసీమ	10	2
ఇతరస్థలాలు	5	13
	400	165

త్రిలోచన కవిరాజు

రవీంద్రనాథ మైత్రగారి కథలకు అనువాదం.
—అనువాదకుడు "చక్రపాణి."

వెల 0-6-0.

ప్రజా ఉద్యమం హెచ్చిన కొలదీ, మహాత్ముని తత్వం మారుతున్నది.

'సివిల్ లిబర్టీస్' పైని తీర్మానం కాంగ్రెసును బలహీన పఱచుతుంది

శ్రీ పి. వి. శివయ్య, బి. యస్. సి.

"ప్రజలకు సత్యాగ్రహాన్ని అవలంబించగల పవిత్రత ఇంకా అలవడలేదు. సత్యాగ్రహాన్ని అవలంబించటానికి, ఆరంభించటానికి, విరమించటానికి హక్కు నాకే వదలివేయండి. మీ శాసన సభా కార్యక్రమానికి నా ఆశీర్వచనాలు" అన్నాడు మహాత్ముడు. 1934 లో వ్యక్తిగత సత్యాగ్రహాన్ని గూడ విరమిస్తూ.

"ఇప్పటికి రెండు ఉద్యమాలు నడచినవి. దేశంలో ప్రజలు ఎంతెంత త్యాగాలైనా చేశారు. ఈ పవిత్రతకు హద్దేమిటి? ప్రజలు ఆచరించలేని పద్ధతివల్ల ప్రయోజన మేమిటి" అన్నాడు గాంధిగారి నమ్మిన శిష్యుల్లో ఒకడు. ఆయన ఇప్పుడులేడు. "దేశం అంతా చేతగాక కూచుంటే యీయన ఒక్కడు సత్యాగ్రహంచేసి స్వరాజ్యము తెస్తాడు! మిగిలిన వాళ్లంతా భరణం లాగు అనుభవిస్తారు! ఎవరికి కావాలి అటువంటి స్వరాజ్యం" అన్నాడు శాంతం అహింసలకు పేరెన్నికగన్న మహానాయకు డొకడు.

తరువాత కొద్ది రోజులకే మహాత్ముడు కాంగ్రెసు పావలా సభ్యత్వానికి గూడ రాజీనామా యిచ్చి "శివగాం"లో తపస్సు ప్రారంభించాడు.

ఎలాగైతేనేం మహాత్ముడి ఆశీర్వచనా లందుకుని ఢిల్లీ ఎసెంబ్లీ ఎలెక్షన్లతో మొదలుపెట్టిన కాంగ్రెసు శాసనసభా కార్యక్రమం, జిల్లాబోర్డులను దాటి రాష్ట్రీ శాసనసభ ఎన్నికల వరకు చండ ప్రచండంగా సాగింది. ఆరు రాష్ట్రాలలో కాంగ్రెసు దిగ్విజయంగా గెలిచింది.

1935 బానిస రాజ్యాంగ చట్టము పుట్టింది మొదలుకొని సత్యమూర్తి ప్రభృతులు మంత్రి పదవులు స్వీకరించాలని హోరెత్తారు. కాని ఎట్లా? కాంగ్రెసు రాజ్యాంగ చట్టాన్ని భగ్నం చేస్తానన్నది. రాజీలేని పోరాటంచేసి ఫెడరేషనును ప్రతిఘటిస్తానన్నది. ఈ పదవీ స్వీకారం ఎలా జరగడం? శాసనసభా వాదులందరు ఆలోచనలో పడ్డారు.

గాంధీమహాత్ముడు యోగనిద్ర మేల్కొన్నాడు. అంతర్వాణి అమృతం చిందింది. "నేను కాంగ్రెసు వాడను కాదు. కాంగ్రెసుకు గవర్నమెంటుకు మధ్యరాజీ కుదిర్చేవాడను' అని అభయ హస్తమిచ్చాడు.

పోరాడి, స్వతంత్రం సంపాదించుకున్న తరువాత, క్రొత్తరాజ్యాంగాన్ని గెలిచిన వారి యిష్టం ప్రకారం ఏర్పాటు చేసుకోటానికి అన్ని దేశాలల్లో కన్వెన్షన్లు ఏర్పాటౌతే ఇక్కడ-మన దేశంలో బానిస రాజ్యాంగ చట్టటం క్రింద మంత్రిపదవులెలా స్వీకరించడమా తేల్చుకోటానికి ఢిల్లీ కన్వెన్షన్ కూడింది.

గవర్నర్లు ప్రత్యేక అధికారాలు వినియోగించరు అని స్వచ్ఛందమైన హామీ లివ్వకపోయినా, ఆ సూచన వైపు ముఖం మళ్లించి మాట్లాడారు వైస్రాయిగారు. కాబట్టి ఫరవా లేదు. కాంగ్రెసు పార్టీ లీడర్లు గవర్నర్ల సంభాషణతో తృప్తిపడితే మంత్రి పదవులు స్వీకరించవచ్చునని గాంధీమహాత్ముడి తీర్మానం. మరల మహాత్ముడు యోగ నిద్రలో మునిగాడు. మద్రాసుతో సహా ఆరు రాష్ట్రాలలోను పదవీ స్వీకారం జరిగింది.

మంత్రి పదవులు స్వీకరించాలన్నప్పుడు అక్కర్లేదని, గవర్నర్ల దగ్గరనుంచి హామీలు గావాలన్నప్పుడు, హామీలిస్తేనే గాని పదవులు స్వీకరించ వద్దని, హామీ లివ్వకపోయినా పదవులు తీసుకోవా లన్నప్పుడు, తీసుకుంటే తీసుకున్నారుగాని, కాంగ్రెసు ఎన్నిక వాగ్దానాలను నిర్ణీత కాలంలో నెరవేర్చలేక పోతే పదవులు వదలిపెట్టాలని, తీవ్రవాదులు పదవీ స్వీకరణ వాదులకు వ్యతిరేకంగా కాంగ్రెసు తీర్మానాల ననుసరించే తీవ్ర ప్రచారం చేశారు.

పదవీ స్వీకరణం అయిన తరువాత ప్రజల్లో నూతనోత్సాహం. ఆశ పెరిగినవి. కాంగ్రెసు ప్రణాళిక ననుసరించి వాళ్ళకు రావలసిన హక్కులేవో, వాటికోసం ఎలా పోరాడాలో, వాటికోసం పోరాడటమే ఎలా స్వతంత్ర పోరాటమౌతుందో, ఎలా మంత్రి వర్గాలను, కాంగ్రెసును బలపరచడ మౌతుందో ప్రజలకు కాంగ్రెసులోని తీవ్రవాదు లందరు చురుకుగా ప్రచారం చేయ మొదలుపెట్టారు. రైతుల యొక్క కార్మికుల వర్గ సంఘాలు విరివిగా స్థాపన కావటం మొదలుపెట్టాయి. మొత్తం మీద ప్రజల పోరాటశక్తి చాల వృద్ధి అయింది. పెట్టుబడిదారుల యొక్క జమీందారుల యొక్క ఒత్తిడి కాంగ్రెసు మంత్రుల మీద ఎక్కువ కాజొచ్చింది. కాంగ్రెసు మంత్రులకు క్లిష్ట పరిస్థితు లేర్పడే భయం గలిగింది. "పోరాడక్కర్లేదు. మేం చేస్తాం చూడం"డంటే ప్రజలూరుకోవటం లేదు.

ఈ లోపల మహాత్ముడు యోగ నిద్రనుంచి లేచాడు. "రక్తపాతంతో కూడిన విప్లవాన్నేగాక, ఇదివరకెన్నడు లేనంత గొప్పదిగా సమిష్టి శాసనోల్లంఘనం కూడ రాకుండా చేయటానికే కాంగ్రెసు మంత్రి పదవులు స్వీకరించ వలసివచ్చింది" అని అన్నాడు. ఈ వాక్యం మీద ఆధారపడి ఉన్నది మహాత్ముడు అస్త్ర సన్యాసం చేసిన తరువాత ఆయన పాలసీ.

దేశము మొత్తము మీద ప్రజల కనీస హక్కుల కొరకు పోరాటా లెక్కువైనవి. పెట్టుబడిదారులు చేసే జీతాల కోతలను, కల్పించే నీచమైన పరిస్థితులను, ఎదుర్కొటానికి కార్మికులు సమ్మెలు చేశారు. వాటి విజయానికి అవసరమైన పికెటింగు చేశారు. జమీందారులు రైతుల భూములను బలవంతముగా ఆక్రమించుకుంటే రైతులా పొలాలలో సత్యాగ్రహము చేశారు. కాంగ్రెసు రాష్ట్రాల్లోనే ఈ పరిస్థితు లెక్కువగా ఉన్నవి. కాంగ్రెసు మంత్రులు మీద ఒక వైపున ప్రజల ఒత్తిడి మరొక వైపున పెట్టుబడిదారుల జమీందారుల యొక్క ఒత్తిడి యెక్కువైనది. కాంగ్రెసు మంత్రులు ఒక వైపున ప్రజలతో "మేం మీవాళ్ళం. మీరు అల్లరి చేయవద్దు. అంతా మేం చేస్తాం." అని చెప్పుతూ జమీందార్లతోటి ఒడంబడికలు చేసుకున్నారు. (బీహారు సంయుక్త రాష్ట్రాలు టెనెన్సీ బిల్లులు) పెట్టుబడిదారుల ఒత్తిడికి లొంగారు. (మద్రాసు ఋణ పరిష్కార చట్టం. బొంబాయి లేబరు బిల్లు) కాంగ్రెసు మంత్రుల యీ నడవడికి ప్రజలలో హాహావిడి ఎక్కువైంది. దేశము నిండా కార్మికుల సమ్మెలు, రైతుల ప్రదర్శనాలు, సత్యాగ్రహాలు మితిమీరినవి. కాని కాంగ్రెసు యొక్క కార్యక్రమాన్ని దాటిపోలేదు, కాంగ్రెసు మంత్రులకు తొందర కలిగింది.

గాంధిగారు తిరిగి మౌనం చాలించారు. "సమ్మెలలో పనికి పోతామన్న కూలీలను పోనీయకుండా పికెటింగు చేయడం మొదటి రకమైన దౌర్జన్యం. ఈ దౌర్జన్యాపటానికి యజమానులు అన్నివిధాలా ప్రయత్నించవచ్చు. పోలీసు దళాలు కావాలని కోరితే కాంగ్రెసు ప్రభుత్వాలు పంపవలసి ఉంటుంది." అని చెప్పారు.

సరి పికెటింగు అశాస్త్రీయమై పోయింది. సమ్మెలు జయప్రదం కావటానికి ముఖ్యమైన సాధనం తీసివేయబడ్డది. ఈ ప్రకటనలోనే రకరకాలైన హింసలనుగురించి వ్రాశారాయన. తమచేత పీడింపబడ్డ రైతుల ఆందోళనకు సత్యాగ్రహాలకు జంకి, రైతు సేవకులమీద దౌర్జన్యం బోధిస్తున్నారని నిందలతో గాంధిగారికి ఉత్తరాలు గుప్పించారు జమీందారులు.

కాంగ్రెసులో మాయ చందాదారులను చేర్పించి-కాంగ్రెసు కమిటీలను వశపరచుకోటానికి త్రాగుడు పోయించి; దౌర్జన్యము చేసిన కర్తీలేని కాంగ్రెసు వాదులు-సోషలిస్టులను తీవ్రవాదులను కాంగ్రెసు కమిటీలల్లోకి రాకుండా చేయటానికి మెంబర్ల లిస్టులను దిద్ది, తప్పుడు నియోజక వర్గాలేర్పరచి, అప్పటికి కష్టమనుకుంటే ఓటర్లపై దౌర్జన్యాలు చేయించిన సత్యసంధులైన కాంగ్రెసువాదులు; సోషలిస్టుల తీవ్రవాదులపై గాంధిగారికి ఉత్తరాలు గుప్పించారు. "అయ్యో కాంగ్రెసు చెడిపోవుచున్నదే" అని అమితమైన పరితాపము పొందిన కొంతమంది ఉత్తరాలు వ్రాశారు. బోనుల్లో నిలువబెట్టవలసిన ముద్దాయీల చేత గాంధిగారు విచారణ చేశారు. ఆయన ఆలోచించి ఆలోచించి చివరకు తేల్చింది, 'కాంగ్రెసు యొక్క మతమైన (creed) సత్యము అహింసలలో నమ్మకుండా కాంగ్రెసును బురఖాగా ఉపయోగించుకుండే అణ్డిసైరబుల్సు ఎక్కువగా ఉన్నారని, మనోవాక్కాయ కర్మల 'సత్యము' దౌర్జన్యరాహిత్యము అవలంబింపకపోతే కాంగ్రెసు విచ్ఛిన్నమై పోతుందని, అణ్డిజైరబుల్సును వెళ్ళగొట్టాలని గాంధీ మహాత్ముడు వర్కింగు కమిటీవారికి సెలవిచ్చాడు. దౌర్జన్య రాహిత్యాన్ని మాస్ స్కేలు మీద అసలు జరపాలని దానికి పీస్ బ్రిగేడ్లు ఏర్పాటు చేయాలని ఏమేమో చెప్పారు. చివరకు ఒక తీర్మానాన్ని తయారు చేశారు.

మహాత్ముని కోర్కె నెరవేరింది. ఎ. ఐ. సి. సి. తీర్మానంలో తీవ్రవాదులపై ఒక బాంబు వేశారు. "కాంగ్రెస్ వారు, దోపిడి, ఇండ్లు తగులబెట్టుట, ఖూనీ, వర్గకలహం ప్రబోధించారు" అని తీర్మానంలో ఉంది. దేశములో రెండు వర్గాలున్నాయని, ఆ రెండు వర్గాల యొక్క స్వార్థం పరస్పర యుద్ధం, కాబట్టి వర్గకలహం ఉన్నదని చెప్పేవాళ్లు సోషలిస్టులు.

పై తీర్మాన ప్రకారం నేడు సోషలిస్టులు దోపిడిగాండ్రు కావాలి — బందిపోటు దొంగలు కావాలి—హంతకులు కావాలి. కాని నిజంగా సోషలిస్టులు హంతకులూ, బందిపోటు దొంగలూనా?

సోషలిస్టులు ప్రబోధించేది రైతుల ఆస్థులను దోపిడీచేసే జమీందారుల హింసను— రైతుల కొంప గోడులను తగులబెట్టించే జమీందారుల హింసను — రైతు స్త్రీల మానభంగాలను గావించే జమీందారుల హింసను-యిక సాగనీయ వద్దంటున్నారు. ఎదుర్కొమంటున్నారు. కార్మికులను రాత్రింబవళ్లు పనిచేయించి పీల్చి పిప్పిచేసే యజమానుల పట్టపగటి దోపిడిని, అపుచేయ మంటున్నారు. పెట్టుబడిదారులకు, యజమానులకు చేయూతనిస్తూ హిందూదేశాన్ని వందలకొలది సంవత్సరాల నుండి దోపిడిచేస్తున్న బ్రిటిషు సామ్రాజ్యవాదాన్ని రూ పు మా పా ల ం టు న్నా రు. సామ్రాజ్యవాదుల, జమీందారుల, పెట్టుబడిదారుల హత్యల నుండి, దోపిడి నుండి, అమాయకులు, నిరాయుధులు, నిరధికారులు అగు కార్మిక, కర్షక ప్రజానీకం బయట పడాలనే ఈ సోషలిస్టులు; హంతకులైతే, దోపిడి గాండ్రయితే, అందుకు ఎవడూ చింతించడనుకుంటాం.

స్వదేశ సంస్థానాలలో ప్రభువులొక వంక ప్రజలపై తుపాకులను కాలుస్తూ, పైశాచిక నిర్బంధ విధానాన్ని సాగిస్తూన్నా, ఇంకొక వంక నుండి, "సత్యాహింసలనే ప్రధానం గాగల కాంగ్రెసు యొక్క అభిప్రాయము సంస్థానాధీశుల హృదయం పరివర్తనము గావించుటకు పదే పదే పాటుబడుటయే" నని తీర్మానంకూడా ఎ. ఐ. సి. సి. లో మహాత్ముని ప్రోత్సాహం వల్లనే ఆమోదింపబడినది.


సంస్థానాధీశుల హింస సాగుతూనే ఉంది. హృదయ పరివర్తన వారిలో కలిగించాలనడం, సంస్థానాధీశుల హింస నిరాఘాటంగా సాగడానికి తా వీయడం గాదా? ఈ సత్యాహింసలు ద్వారా అనే దాన్ని బొంబాయి కాంగ్రెసు అంగీకరించలేదు. వాటి స్థానే "శాంతియుత, ధర్మ

(మిగతా 12 వ పేజీలో)

మనవి.

ఈ వారం పత్రిక రాదని ప్రకటించాం. అయినా, అంతర్జాతీయ, పరిస్థితులు ముఖ్యమైనవి గనుక, యుద్ధ వార్తా సంచికగా దీనిని ప్రకటించదలచాం. కాని 20 పేజీలకని ప్రారంభించి 18 పేజీలు మాత్రం పూర్తిచేయ గలిగాం. వచ్చే సంచిక యథావిధిగ 24 పేజీలతో వెలువడుతుంది.

—మేనేజరు.



5—10—38 బుధవారం

అహో! ఛాంబర్లేన్ !!

తల్లికి జ్వరం తాపం హెచ్చింది. 'ఈ జ్వర బాధ తప్పించి, నా శరీరం కొంచెం చల్లగా ఉండేటట్లు చూడు నాయనా' అన్నది తల్లి. వివశమై పడివున్న తల్లి నడుము కొక త్రాడు కట్టాడు. నూతిలో ముంచాడు. పైకి లాగాడు. తల్లి శరీరం చల్లగా ఉంది. "నీవు చచ్చిపోతే పోయావుగాని, నీ జ్వరం పోయింది తల్లీ" అని ఆ పిచ్చి వెధవ సంతోషించాడు.

జకోస్లావేకియా బలి అయింది. జర్మను సైన్యాలు జక్‌లో ప్రవేశించాయి. పోలండు తన వంతునూ మ్రింగింది. ఇక హంగేరీ నోరు తెరుచుక కూర్చున్నది. అయితే నేం—యుద్ధం. ప్రపంచ యుద్ధం తప్పించవని ఈ పిచ్చి లోకం సంతోషిస్తు న్నది. నీవు ఆ ప్రపంచ యుద్ధాన్ని తప్పించావని ఈ వెర్రి ప్రపంచం గంతులు వేసింది. ఇంత మందిని 'వెర్రి కుంకల'గా చేసిన ఛేంబర్లేను మహాశయా! నీ వెంత రాజనీతి (కుటిల?) పరుడవు !!

ప్రపంచ యుద్ధం తర్వాత ఎన్నో యుద్ధాలు జరిగాయి. యుద్ధాన్ని ఆపుజేయ డానికే ఆ మహా యుద్ధం అని ఆనాడు మీ బ్రిటనూ అన్నది. కాని ఎన్నో యుద్ధాలు జరుగుతూంటే మీ బ్రిటన్ కళ్ళు మూసుక కూర్చున్నది. నానాజాతులసభలో ప్రధాన పాత్ర మీ బ్రిటన్‌ది. మీరు, మరికొన్ని పెద్ద రాజ్యాల వారిని కూడగట్టుకొని ఏమంటే అది సాగింది. అలాంటి నానాజాతి సమితి, జపాను మంచూరియాను ఆక్ర మించినపుడు గుటకలు వేస్తూ కూర్చున్నట. ఇటలీ అబిసీనియాను మ్రింగితే మీ బ్రిటన్ కాళ్లు జాచుక కూర్చున్నది. ఇటువంటి సామ్రాజ్యవాదుల ఈ పట్టపగటి దోపిడిని చూస్తూ—సహిస్తూ ఊరుకొన్న మీ విదేశ రాజ్యాంగ నీతిని చూచి ప్రపంచం ఛీ అన్నది. అంతేనేం? ఏమి లెక్క. అట్టి బ్రిటన్‌కు నీవు ప్రధాని వయావు, ఇదివర కున్న ఈడెన్ మంత్రివర్గం, నీవూ, నీ అనుచరుడు హాలిఫాక్సూ, నీ వెనుక నున్న ఫైనాన్షియల్ బూర్జువా అనుకొన్నంతగా, ఫేసిస్టు అనుకూల వైఖరిని అవలంబించ లేదు, అందుకని అబిసీనియా మ్రింగిన ముసోలినీ స్నేహం వాంఛించి ఈడెన్ మంత్రి వర్గాన్ని పడగొట్టావు. ప్రధానివి అయావు, ఛాంబర్లేను మహాశయా! నీవేనాడు అడుగుబెట్టావో కాని, ఆనాటి నుండి, ఫాసిస్టు తార దేదీప్యమానంగా వెల్గు తున్నది.

నీవు వచ్చేనాటికే నాన్ ఇంటర్వెన్షన్ మహానాటకం జరుగుతున్నది. స్పైన్‌లో ఫాసిస్టుల ముష్కరత బ్రిటిష్ ప్రజలకంతా రోత పుట్టించి ఆగ్రహం కల్గించింది. అయినా నీవు ముసోలినీతో ముచ్చటలాడ సాగావు. జర్మనీతో రాయబారాలకై హాలిఫాక్సు ప్రభువును పంపసాగావు. తాటస్థ్య సంఘమనే తతంగంతో స్పానిష్ ప్రజలకు ఆ యుధాలు లేకుండా జేశావు. జర్మనీ, ఇటలీలు వలంటీర్లను, ఆయుధా లను పంపుతున్నా నీ వేమీ ఎరగనట్లే నటించావు. నీ ప్రజలు స్పైన్ తరఫున పోరాడి మరణించారు. రాల్‌ఫాక్సు వంటి యువక రచయిత లెందరో నీ దేశం వాళ్ళు స్పైన్ విద్రోహులకు బలి అయారు. నీ వర్తక నౌక లెన్నిటినో ఫ్రాంకో ముంచి వైచాడు. నీ యూనియన్ జాక్‌కు ఎంతో అవమానం కల్గింది. అయితే మాత్రం ఏమి? నీవు నిజమైన క్రీస్తు శిష్యుడవు. క్రీస్తు ఒక చెంపను గొట్టితే రెండో చెంప చూపెట్ట మన్నాడు. కాని ప్రపంచమంతా నీపై నొక చెంపను ఉమ్మివైచితే మరొక చెంప చూపుతావు. శాంతమూర్తీ! నిన్ను తెలియనివాళ్ళు పిరికిపంద వంటున్నారు. చవట వెధవవు అంటున్నారు!!! దేశ గౌరవం మట్టిపాలు జేస్తున్నా వంటున్నారు!!!! కాని వెధవ లోకం. వాళ్ళకేం తెలుసు. ఎలాగైనా సరే—ఎన్ని అవమానాలు జరిగినా సరే—నీ పని నీవు చక్కబెట్టుకొని వెళ్లే రకం. ఆ ఓర్పు ఎవరికి ఉంటుంది.

భూత దయా పరుడవంటే నిన్నే అనాలి. ఏమైనా సరే శాంతి గదా. అందు కనే స్పానిష్ పిల్లలకు ఆహారం తీసుకొనే ఓడలపైన బాంబులు వేస్తున్నా. నీవు నియమించిన బ్రిటిషు కమిషన్లే విద్రోహుల బాంబుల వేయడం గర్హించుతున్నా నీ నోటి వెంబటి మాట రావడంలేదు. ఫ్రాంసును అదరించి బెదరించి 'పైరినీస్' సరిహద్దును మూయించి స్పైయిన్‌ను నిరాధారముగ చేసి, ఇటలీ జర్మనీల దోపిడికి. హత్యలకు సహాయం చేస్తున్నావు. స్పైయిన్ వాళ్ల చావనీ—బ్రిటిషు వాళ్ల చావనీ—బ్రిటిషు నౌకలు—వర్తకులు మట్టిపాలు గానీ—బ్రిటిష్ గౌరవం మంట గలయనీ, నీవు మాత్రం ఆంగ్లో—ఇటలీ సంధికై ఎంతో ప్రయత్నించావు. ఫేసిస్టులతో-యుద్ధ పిపా సులతో సంధి చేసికొని, శాంతిని కాపాడదలిచావు. ఫాసిస్టులకు ఎంతమంది స్పైన్ ప్రభుత్వపక్షీయులు పోరాడి మరణించుతున్నా, ఇంకా నీవు శాంతిని కాపాడుతు న్నాననీ—యుద్ధాన్ని తప్పించుతున్నావని చెప్పుచుండుటచేత, నిన్ను భూతదయా పరుడ వనాలి! స్పైన్ ప్రభుత్వం పోతే పోయింది గాక, స్పైన్ తరఫున ఎంత మంది మేధావులు మరణిస్తే మరణించారు గాక, వలంటీర్ల సమస్యపై ఫ్రాంకో నిన్ను తిరస్కరించితే తిరస్కరించాడు గాక, నీవు భూతదయాపరుడవు! శాంతి ప్రియుడవు !! అందుకనే, నీచాతి నీచమైన అవమానాలు సహిస్తున్నావు. అహో ఛాంబర్లేను! నీ కెంత సహనం !!

జకోస్లావేకియా సమస్య వచ్చింది. హిట్లర్ తమ అల్ప సంఖ్యాలకు సంగతి ఏమిటి అని అన్నాడు. రన్సిమన్ ప్రభువును పంపించావు. రన్సిమన్ నాజీలతరఫునే చెప్పాడనుకోండి. ఎన్నో కుట్రలు సల్పి జకోస్లావేకియాను మెడలు వంచాడే అను కోండి—నీవు మాట్లాడలేదు. ఇటలీలోని, పోలండ్‌లోని జర్మనుల సంగతేమిటి అని హిట్లర్‌ను అడుగలేక పోయావు. నీవు నీ వలస దేశాలలో బానిసల సంగతి మఱచి పోయావు. పాలస్టయిన్‌లో వజీర్ స్థాన్‌లో, నీవు నేడు జక్ జర్మ నుల కంటె హీనంగా బ్రతుకు కోట్ల కొలది ప్రజల స్వాతంత్ర్యోద్యమాన్ని అణచ డానికి బాంబులు వేశావు. తుపాకులతో కొట్టి చంపుతున్నావు. 35 కోట్ల హిందూ దేశ ప్రజల బానిసత్వాన్ని మరచి పోయావు. ఎన్నో హక్కుల ననుభవిస్తున్న జక్ జర్మనులపై హిట్లర్ భయంవల్ల దాక్షిణ్యం తలచావు.

హిట్లర్ బెదరింపులకు లొంగి, అనేక సార్లు ఎంతో కష్టపడి హిట్లర్ పాదా క్రాంతుడవై "పాహిమాం పాహిమాం" అన్నావు. ఫ్రాంసును మెడవంచి, జకోస్లా వేకియాకు తెల్పకుండానే, కొంత బలి గావించావు. చరిత్రలో కనీ వినీ ఎరుగని, ఈ ద్రోహానికి కూడ జక్ ప్రభుత్వం తల యొగ్గింది. అయినా నీవు, ఫ్రాన్సు ప్రధాని దలదీర్ గలసి గావించిన తీర్మానాన్ని హిట్లర్ కాల దన్నినాడు. అయినా జక్ ప్రభుత్వ పక్షం వహించక 'మనకు సంబంధించని' విషయం అన్నావు. పార్లమెంటులో ఎన్నో వగలు పోయావు. చివరకు హిట్లర్ ఆహ్వానం అంగీకరించి మ్యూనిక్ సమావేశంలో జకోస్లావేకియాను బలిగావించడానికి అంగీకరించావు. నీతో పాటు ఫ్రెంచి ప్రధానిని, జకోస్లావేకియా, రష్యాలతో ఉన్న సంధిని భగ్నం కావిం చేటట్లు గావించావు. హిట్లర్, ముసోలినీ, దలదీర్‌లతో గలిసి జకోస్లావేకియాను అక్టోబర్ 1 నాటికి బలిగావించావు.

నిన్ను కార్మికులు తిట్టనీ, నీవు పోవాలని కేకలు వేయనీ, నీ తోటి మంత్రులు రాజీనామా నీయనీ, 20 ఏండ్లు హాయిగా బ్రతికిన జక్ ప్రభుత్వం సర్వ నాశనమవనీ, నీవు ప్రపంచ యుద్ధం తప్పించావని పేరొందినావు! ఫాసిస్టులకు బల మిచ్చి, మానవత్వాన్నీ ప్రపంచ శాంతికి మూలమయిన కార్మిక కర్షక పీడిత ప్రజల ప్రాణమయిన రష్యానూ నాశనం గావించడానికి మరో ప్రపంచయుద్ధానికి తావిచ్చినా నీ విపుడు యుద్ధం తప్పించావు.

ఛాంబర్లేను మహాశయా! శాంతి ప్రియా! మానాభిమాన విహీనా! హిట్లర్ ముసోలినీ పాదసేవకా! జక్ ప్రజా రాజ్య విఘాతకా! ఇదే నీ యుక్తికిన్నీ శాంతి యత్నంబుకున్... నమస్తే, నమస్తే, నమః...

ఢిల్లీ ఎ. ఐ. సి. సి. తీర్మానాలు ★★ ★★

ఎన్నికలు

హరిపుర కాంగ్రెసు వారు నియమించిన కాన్స్టిట్యూషన్ సబ్‌కమిటీవారు యీ క్రింది నివేదికను ప్రచురించారు.

"ఈకమిటీవారి ప్రథమ సమావేశం బొంబా యిలో మే 18, మే 19, తేదులలో జరిగినది. ఆ సమావేశానికి యీ క్రింది సభ్యులు హాజ రయారు. పండిత జవహర్‌లాల్ నెహ్రూ, జైరాందాస్ దౌలతరాం, డాక్టరు పట్టాభి సీతా రామయ్య, అచ్యుత పట్వర్ధన్, కిరణ శంకర రాయ్, సయ్యద్ అబ్దుల్ బ్రెల్వి, జె. బి. కృపాలినీ గార్లు.

ఈ కమిటీవారు యీ క్రింది విషయాలను చర్చించడానికి నియమింప బడ్డారు.

1. పరోక్షపు ఎన్నికల ద్వారా డెలిగేట్లకు ఎన్నుకోవడం యుక్తమా, కాదా?

2. యోగ్యులైన సభ్యులు: సరియైన ఎన్ని కలు.

3. ఏ. ఐ. సి. సి. లోను, రాష్ట్రాలలోను ప్రాంతీయ ప్రాతినిధ్యాన్ని పెట్టడం మంచి దేనా, అయితే అది ఎలావుండాలి?

4. ఏ. ఐ. సి. సి. సభ్యత్వానికి సింగిల్ ట్రాన్స్ఫర్ బుల్ ఓటుద్వారా ప్రపోర్షనల్ ప్రాతి నిధ్యాన్ని ఏర్పాటు చెయ్యడము కుదురుతుందా? నియోజక వర్గాలను ఏర్పాటు చెయ్యడంలో అవలంబించ వలసిన మార్పులు ఏమిటి?

రెండు విషయాలు మాత్రమే

కమిటీవారు పై నాలుగు విషయాలలోనూ, మొదటి రెండు విషయాలను గూర్చి మాత్రమే మొదట చర్చించారు. ఈ రెంటిలోనూ మొదటి విషయాన్ని గురించి వీరు ఏమీ నిర్ణయాన్ని చెయ్యలేదు. రెండో విషయాన్ని గురించి వివిధ రాష్ట్రీయ కాంగ్రెసు సంఘాలవారు పం పిన సూచనలను యీ కమిటీవారు 1938 సెప్టెంబర్ 20 తేదీన ఢిల్లీలో హరిజన కాల నీలో సమావేశమై చర్చించారు. సమావేశానికి యీ క్రింది సభ్యులు హాజరయారు. భూలాభాయ్ దేశాయ్, సయ్యద్ అబ్దుల్ బ్రెల్వి, డాక్టరు పట్టాభి శీతారామయ్య, ఎం. ఏ. అయ్యంగారు, జె. బి. కృపాలినీగారు, భూలా భాయ్ దేశాయిగారు అధ్యక్షత వహించారు.

వీరు యీ క్రింది నిర్ణయాలను చేశారు.

పరోక్షపు ఎన్నికలు.

ప్రాథమిక సభ్యుల సంఖ్య ఎక్కువగా పెరుగుతున్నది కనుకను, వారంతా ప్రత్యక్ష ఎన్నికలలో పాల్గొనటం వల్ల వారికి కలిగే యిబ్బంది, ఖర్చులు ఎక్కువగా ఉండటం వల్లనూ, కాంగ్రెసుకు ప్రతినిధులను ఎన్నుకో వడం పరోక్షపు ఎన్నికల ద్వారానే జరిగితే మంచిదని యీ కమిటీవారి అభిప్రాయము. ఈ ఎలక్షనుల కోసం జిల్లా కాంగ్రెసు కమిటీవారు ఒక ఎలక్టొరల్ కాలేజిని ఏర్పాటు చెయ్యాలనీ, జిల్లా కమిటీ సభ్యులు కాంగ్రెసుకు డెలిగేట్లను ఎన్నుకోవాలనీ యీ కమిటీవారు సూచించు చున్నారు. జిల్లా కాంగ్రెసు కమిటీకి ఎన్నికలు ప్రత్యక్షముగానే ప్రాథమిక సభ్యులలోనుంచే జరగాలి. జిల్లా నన్నిటినీ తెవిన్యూ ఫిర్కాలలో లాగ నిర్ణీత ప్రాంతీయ నియోజక వర్గాలుగా విభజించాలి.

ఒక్కొక్క ఫిర్కాలో చేరిన ప్రాథమిక సభ్యుల సంఖ్యను బట్టి ఆ ఫిర్కానుండి జిల్లా కమిటీకి ఎన్నుకోబడ వలసిన సభ్యుల సంఖ్య ఏర్పాటు అగును. ఎంతమంది ప్రాథమిక సభ్యు లకు ఒక్క జిల్లా కమిటీ సభ్యుడుండాలో ఆ ప్రమాణం జిల్లా కంతటికీ ఒకటే. దీనిని రాష్ట్రీ కాంగ్రెసు కమిటీ నిర్ణయిస్తుంది.

జిల్లా కాంగ్రెసు కమిటీ ఎన్నికలు ప్రతి సంవత్సరమూ జరగాలి. కాంగ్రెసు డెలిగేట్ల ఎన్నికలు కూడా అలాగే ప్రతి సంవత్సరమూ జరగాలి. కాంగ్రెసులోని ఏ ప్రాథమిక సభ్యు డైనా కాంగ్రెసుకు డెలిగేటుగా ఎన్నికలలో నిలబడానికి హక్కును కలిగి ఉన్నాడు.

జిల్లా కాంగ్రెసు కమిటీవారు కాంగ్రెసుకు డెలిగేట్ల ఎన్నికలు డిస్ట్రిబ్యూటివ్ ఓట్ల ద్వారా జరపాలి. ఈ డెలిగేట్లు, ఆ జిల్లా కమిటీకి ఎక్సుఅఫిషియో సభ్యులు అవుతారు. ఇది వరకు లాగానే వారు రాష్ట్రీ కాంగ్రెసు కమిటీకి కూడా సభ్యులవుతారు.

మెంబర్లను చేర్చుకోవడం.

కాంగ్రెసు కమిటీలలో అధికారములో నున్న వారు, వ్యక్తిగతంగా గాని, రాజకీయంగా గాని తమకు వ్యతిరేకంగా నున్నవారికి సభ్యత్వపు పుస్తకాలను ఇచ్చుటకు చాలా పర్యాయములు నిరాకరించిరనియు, మరికొన్ని చోట్ల విరివిగా పుస్తకములు ఇవ్వబడిన ప్రాంతాలలో తమ తమ పార్టీ బలాలను వృద్ధి చేసుకొనుటకు దగా సభ్యత్వములను పూర్తిచేసిరనియు అనేక ప్రాంతాల నుండి. కంప్లెయింటులు వచ్చినవి - ఇవిగాక, పుస్తకములను పట్టుకొని వెళ్ళి సభ్యత్వపు చందాలను వసూలుచేసి పుస్తకములు గాని డబ్బుగాని తిరిగి జిల్లా కమిటీకి పంపనటు వంటి వారిని గూర్చి కూడా చాలా కంప్లెయింట్లు వచ్చినవి—

దరఖాస్తు ఫారములను అచ్చు వేయించ డము, సభ్యులను చేర్పించడము, చందాలను వసూలు చెయ్యడము మొదలైనవన్నీ నెరవే ర్చుటకు నమ్మకమైన, బాధ్యతగల వారిని జిల్లా కాంగ్రెసు కమిటీవారే యేర్పాటు చేయాలి. జిల్లాలోగాని, జిల్లా కాంగ్రెసు కమిటీవారు నిర్ణ యించిన ప్రదేశంలో గాని సభ్యులను చేర్పించ డానికి జిల్లా కాంగ్రెసు కమిటీ సభ్యులును, రాష్ట్రీ కాంగ్రెసు కమిటీ సభ్యులును, జిల్లాలోని ఏ. ఐ. సి. సి. సభ్యులును, తాలూకా కాంగ్రెసు కమిటీ సభ్యులును, నగర కాంగ్రెసు కమిటీ సభ్యులును సభ్యత్వపు దరఖాస్తు పుస్తకాలను కాంగ్రెసు కమిటీ కార్యాలయాల నుంచి తీసు కొని వెళ్ళడానికి హక్కును కలిగి వుందురు. జిల్లా కాంగ్రెసు కమిటీవారు, నమ్మకస్తులని తమకు తోచినవారికి కూడా ఈ పుస్తకాలను యివ్వవచ్చును. ఈ పుస్తకాలను తీసుకొని వెళ్ళినవారు వసూలు చేసిన చందాలను జిల్లా కాంగ్రెసు కమిటీ కార్యాలయంలో జమకట్ట డానికి బాధ్యులై యున్నారు.

వోటర్ల లిస్టులు.

సభ్యులను ప్రతి సంవత్సరమూ చేర్పించ డము మంచిదని యీ కమిటీవారి అభిప్రా యము. ప్రతి ఫిర్కాకును, సర్కిలుకును ప్రతి సంవత్సరమును వోటర్ల లిస్టును తయారు చెయ్యాలి. జిల్లా కాంగ్రెసు కమిటీ వారు యీ లిస్టులను తయారు చేయించడానికి బాధ్యులై వుండాలి. ప్రకటనార్థముతాలూకా కాంగ్రెసుకమిటీ లకు పంపాలి. ప్రాథమిక సభ్యులలిస్టు ఎన్నిక లకు కొంత కాలము ముందుగానే తయారయి వుండాలి. ఆక్షేపణలు ఏమైనా వుంటే వాటిని కాంగ్రెసు కమిటీ కార్యాలయానికి పంపించ వలసిన తేదీని కూడా నిర్ణయించి. సవరణ నిమిత్తం ప్రతి ఫిర్కా ఆఫీసు నందును ముం దుగా ప్రకటింపబడాలి. ఈ నిర్ణయాల్ని జిల్లా కాంగ్రెసు కమిటీవారు చెయ్యాలి.

ప్రతి సంవత్సరం ప్రతి ఫిర్కాకును ఒక క్రెడెన్షియల్ కమిటీని జిల్లా కంతటికి ఒక క్రెడెన్షియల్ కమిటీని, జిల్లా కాంగ్రెసు కమిటీ వారు ఏర్పాటు చేయాలి: ప్రాథమిక సభ్యులు తమ ఆక్షేపణలను ఫిర్కా క్రెడెన్షియల్ కమి టీకి ఫిర్యాదు చేయాలి. వీటి నిర్ణయాలపై అప్పీళ్లు జిల్లా క్రెడిన్షియల్ కమిటీకి చేసుకో వచ్చును. దీనిదే తుది నిర్ణయం. ఈ విచారణ నిర్ణయానంతరం తేలిన ఓటర్లలిస్టు ఖాయమైనది. దీనిని పి. సి. సి. కి పంప వలయును. ఈ లిస్టులే ఎన్నికలలో ఆధారంగా తీసుకోబడును.

ప్రతి జిల్లాలోనూ ఎన్నికలలో నామినేషన్ ఫారాలను పరిశీలించుటకును, ఇతర పనుల కును ఎలెక్షన్ ఆఫీసర్లను, పోలింగు అఫీస ర్లను పి. సి. సి. నియమించును. గ్రాను కాం గ్రెసు కమిటీ ఎన్నికలకు మాత్రము యిది వర్తించదు.

ఏ. ఐ. సి. సి. లో ప్రాతినిధ్యము.

ఇప్పుడు ఉన్నట్టుగానే, ఎ. ఐ. సి. సి. కి ఎన్నికలు ఉంటే చాలునని మా అభిప్రాయము. స్త్రీలకు, ముస్లిములకు, క్రైస్తవులకు, హరి జనులకు, పంజాబులో శిక్కులకు అదే విధ ముగా ప్రతి జిల్లాకును ప్రాతినిధ్యము యివ్వ డానికి ఒక ఆచారాన్ని ఏర్పరచడము మంచిదని మా అభిప్రాయము.

ప్రస్తుతం జరుగుతూ వున్నట్టుగా సింగిల్ ట్రాన్స్ఫరబిల్ ఓటుతో ప్రపోర్షనల్ ప్రాతి నిధ్యాన్ని యివ్వడంవల్ల, చిన్నచిన్న గ్రూపులు ఏర్పాటయి ఒకరితో ఒకరు తగాదాలు పడుతూ వున్నారు కనుక యీ పద్ధతికి మేము వ్యతిరే కంగా వున్నాము.

ఎక్కువ సఖ్యతను, సంపూర్ణ సాముదా యక బాధ్యతను కలిగించుటకై, ప్రతి రాష్ట్రి మునుండి ఏ. ఐ. సి. సి. కి, డిస్ట్రిబ్యూటివ్ ఓటు (అందరూ కలసి, ఏ. ఐ. సి. సి. కి సభ్యులను ఎన్నుకోవాలి. ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే వారు సభ్యులగుదురు). ఈ ప్రకా రము ఎన్నికలు జరుగుట చాలా మంచిదని సూచిస్తున్నాము" అని కమిటీవారు అభిప్రాయ పడుతున్నారు. సయ్యద్ అబ్దుల్ బ్రెల్వీగారు మాత్రం ప్రస్తుత విధానాన్నే వుంచమని అభి ప్రాయ పడుతున్నారు.

*

అఖిల భారత కాంగ్రెసు కమిటీ సమావే శంలో యీ క్రింది తీర్మానములు ఆమో దించబడినవి:—

పాలస్టయిన్

ప్రభుత్వ వైఖరి ఖండన.

అరబ్బుల అభీష్టానికి వ్యతిరేకంగా పాలస్టయిన్ [illegible] ...ను విభజించుటలోను బ్రిటిష్ ప్రభుత్వపు నిర్ణయాన్ని, దానిని అమలు జరుపుటకు బ్రిటిష్ ప్రభుత్వము, ఒక కమీషన్‌ను నియ మించుటను, హరిపుర కాంగ్రెసు ఖండించినను, అదే ప్రయత్నాన్ని కొనసాగించుటకు బ్రిటిష్ ప్రభుత్వము తీరని కృషి చేయుటను చూచి అఖిల భారత కాంగ్రెసు కమిటీవారు తమ విచా రమును తెలుపుచున్నారు. నేడు బ్రిటిష్ ప్రభు త్వము అరబ్బులపై సాగించుచున్న నిర్బంధ విధానం, పాలస్టయినులో అరబ్బులకును, బ్రిటిష్ వారికిని యుద్ధమువలెనే పరిమణించి నది. బ్రిటిష్ ప్రభుత్వము యొక్క యీ బీభత్స పరిపాలనా విధానానికి ఎ. ఐ. సి. సి. వారు తమ తీవ్ర అసమ్మతిని వెలిబుచ్చు చున్నారు.

ఫెడరేషన్

"ఫెడరేషన్ విషయమై కాంగ్రెసు ధోరణిని గురించి కొంతమంది సందేహాలను వెలిబుచ్చు తున్నారు కాబట్టి, వాటి నివారణకై కాంగ్రెసు హరిపూర్‌లో చేసిన యీ క్రింది తీర్మానాన్నే పునరుద్ఘాటించు చున్నది.

హరిపూర్ తీర్మానం.

"నూతన రాజ్యాంగ చట్టమును కాంగ్రెసు ఇదివరలోనే తిరస్కరించి యున్నది. యే రాజ్యాంగమైనను, భారత ప్రజలచే ఆమోదింప బడవలెననిన, స్వాతంత్ర్యము దానికి ప్రధాన సూత్రముగ నుండవలెననియు, విదేశీయ అధి కారుల జోక్యము లేని కాన్స్టిట్యూయెంటు ఎసంబ్లీ ద్వారా ప్రజలే దానిని నిర్ణయించుకొన వలెననియు ప్రకటించి యున్నది. నూతన రాజ్యాంగము నీ విధముగా తిరస్కరించి, స్వాతంత్ర్య సమరమునందు పోరాడు భారత ప్రజల కింకను బలము చేకూర్చు నిమిత్తము, రాష్ట్రీములలో కాంగ్రెసు మంత్రివర్గము లేర్ప డుటకు కాంగ్రెసు అనుమతించినది. ఫెడరేషను విషయములో మాత్రము ఈ విధమైన యొప్పు దలను తాత్కాలికముగనైన తలపెట్టుట కవ కాశములేదు. ఈ ఫెడరేషను అమలులోనికి తెచ్చినయెడల, భరత వర్షమునకు చాల నష్టము కలుగును. సామ్రాజ్య తత్వముయొక్క అధి కారములో భరతవర్ష మింకను బానిసత్వమున తిరిగిపోవలసి వచ్చును. ప్రభుత్వమునకు ప్రాణ తుల్యమైన అధికారములను ప్రజల ప్రతినిధుల కొసంగుటకు ఈ ఫెడరేషను విధానము తావి చ్చుట లేదు.

"ఫెడరేషనను సిద్ధాంతానికి కాంగ్రెసు ప్రతి కూలముకాదు. బాధ్యతమాట యటుండగా నిజ మైన ఫెడరేషను ఏర్పడుటకు, అందుచేరు రాష్ట్రీములన్నియు హెచ్చుతగ్గుగా నొకేవిధమైన స్వాతంత్ర్యమును, పౌరస్వేచ్ఛను కలిగియుండి ప్రజాతంత్రము ననుసరించిన ఎన్నికల విధానము ద్వారా ప్రాతినిధ్యము కలిగి యుండవలెను.

"ఫెడరేషనులో చేరు స్వదేశ సంస్థానములు ప్రజా ప్రతినిధి సంస్థల విషయములోను బాధ్య తాయుత ప్రభుత్వ విషయములోను పౌరసత్వపు హక్కుల విషయములోను ఫెడరల్ శాసన సభకు ఎన్నికల పద్ధతిలోను బ్రిటిషు రాష్ట్రీము లను దాదాపుగా పోలి యుండవలెను. అట్లు కాని యెడల ఫెడరేషను భరత వర్షము... [illegible]

లను పెంపొందించి, సంస్థానములు బాహ్యోంతర సంఘర్షణలలో చిక్కుకొనుటకు కారణమగును.

"ఈ కారణము వలన, ఫెడరేషను విధానమునెడ నిరసనను కాంగ్రెసు వెనుకటివలెనే యిప్పుడును తిరిగి యుద్ఘాటించు చున్నది. ఈ ఫెడరేషను విధానము అమలు జరుపబడకుండ రాష్ట్రీయ, స్థానిక కాంగ్రెసు కమిటీలును, ప్రజలును మాత్రమేకాక, రాష్ట్రీయ ప్రభుత్వములు, మంత్రి వర్గములుకూడ ప్రయత్నింపవలెనని కాంగ్రెసు ఆదేశించు చున్నది. ప్రజల యిచ్ఛను వ్యతిరేకముగా ఈ ఫెడరేషనును బలవంతముగా అమలులో పెట్టుటకే బ్రిటిషు ప్రభుత్వం ప్రయత్నించునెడల అట్టి ప్రయత్నమును సకల విధముల నిరోధింపవలెను. రాష్ట్రీయ ప్రభుత్వమును, మంత్రి వర్గములు అందు తోడ్పడ నిరాకరింపవలెను. ఇట్టి ప్రమాదమే సంభవించునెడల ఈ విషయమున నేయే చర్యలు గైకొనవలెనో నిర్ణయించుటకు అఖిల భారత కాంగ్రెసు సంఘమున కధికారమీయడమైనది."

ఈ కాంగ్రెస్ తీర్మానములోని సత్యాన్ని దృఢపరచే సంఘటనలు గలిగినవని అ. భా. కాంగ్రెస్ కమిటీవారు తలచుచూ, దేశాభీష్టమునకు వ్యతిరేకంగా భారతదేశంపై ఫెడరేషనును రుద్దుటకు బ్రిటిష్ ప్రభుత్వం చేసే ప్రయత్నాలకు కాంగ్రెస్ లొంగునను ఆశను పెట్టుకొన వద్దని బ్రిటిషు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.

"కేంద్రంలో బాధ్యతలేని ప్రభుత్వాన్ని యింకా కొనసాగించడం, సహింపరాని దౌర్జన్యమైనది. ఇంకా అలా కొనసాగిస్తే, సాధ్యమైతే వాయిదా వేద్దామని అందరూ ఆశించే ప్రతిష్టంభన (crisis)ను తీసుకొని రావలసి వచ్చునని యీ కమిటీవారు చాటుచున్నారు."

సంస్థానాలు.

స్వదేశ సంస్థానాలను గురించి అఖిలభారత కాంగ్రెసు కమిటీవారు యీ క్రింది తీర్మానాన్ని ఆమోదించారు.

"తిరువాన్కూరులో కొంత కాలం నుంచి సాగుతూన్న నిర్బంధ విధానానికి అఖిల భారత కాంగ్రెసు కమిటీవారు విచారాన్ని, ఆదుర్దాను చూపుతున్నారు. కాంగ్రెస్ కార్యాలయానికి వచ్చిన వార్తలనుబట్టి అవి నమ్మదగినవే అయినట్లయితే, తిరువాన్కూరులో నేడు సంస్థాన కాంగ్రెస్‌చే నడుపబడుతూన్న ఉద్యమము పూర్తిగా న్యాయసమ్మతమైనది. తిరువాన్కూరు మహారాజావారి అధికారం క్రింద బాధ్యతాయుత పరిపాలనను స్థాపించాలనే సక్రమాదర్శం కొరకు ఈ ఉద్యమం బయలు దేరింది. ఇది దీని ఆదర్శంకాదని సంస్థాన ప్రభుత్వం తరఫున ప్రకటన ఒకటి చేయబడి నప్పటికీ, సంస్థాన కాంగ్రెసు నాయకులు ఆ ప్రకటనను ఖచ్చితంగా ఖండించారు.

"ఈ పరిస్థితులలో తిరువాన్కూరు సంస్థాన ప్రభుత్వం యీ క్రింది విధానాన్ని అవలంబించవలసినదిగా అఖిలభారత కాంగ్రెసు కమిటీవారు సిఫార్సు చేస్తున్నారు: సంస్థాన కాంగ్రెసు బాధ్యతాయుత పరిపాలన కొరకు సక్రమ పద్ధతులపై యీ ఉద్యమాన్ని నడుపుటకు పూర్తియైన స్వాతంత్ర్యాన్ని కలిగి యుంటుందని సంస్థాన ప్రభుత్వం ఒక హామీ (assurance) ని ఈయాలి. బాధ్యతాయుత పరిపాలనను ప్రసాదించుట ఎంతవరకు సాధ్యమో పరిశీలించుటకొక ఉపసంఘాన్ని నియమించి, దానిలో సంస్థాన కాంగ్రెసు ప్రతినిధులకు కూడా స్థానం యిచ్చుట, తిరువాన్కూరు సంస్థానంలో యీ మధ్య జరిగిన సంఘటనలను గురించి, ముఖ్యంగా సంస్థాన కాంగ్రెసుపై ప్రభుత్వము చేసిన ఆరోపణలను గురించియు, నిరాయుధులైన ప్రజలపై తుపాకులు కాల్చి, కొందరి మరణానికి — మరి కొందరి గాయాలకు కారణమైన, ప్రభుత్వ చర్యలను గురించియు, రాజకీయ ఖైదీల విడుదలను గురించియు కఠినమైన నిష్పక్షపాత బుద్ధిలో విచారణ చేయుటకు తిరువాన్కూరు బయటినుండి ఒక న్యాయశాస్త్ర నిపుణుని నియమించ వలసినదిగా యీ కమిటీవారు సంస్థాన ప్రభుత్వానికి సిఫార్సు చేస్తున్నారు.

"హైదరాబాద్ సంస్థాన ప్రభుత్వంవారు, ప్రస్తుత పరిస్థితులలో అనవసరమైన ఆర్డినెన్సులు ప్రయోగించి నందుకు కాంగ్రెసు కమిటీవారు విచారిస్తున్నారు.

"ఢేంకానల్, కాశ్మీర్, తెల్చార్, మొదలైన సంస్థానాలలో కూడా తీవ్రమైన నిర్బంధ విధానం అవలంబింప బడుతూన్నట్లు కమిటీ వారికి కంప్లెయింట్లు అనేకం వచ్చాయి. ఈ సందర్భాలలో సంస్థాన ప్రజలు సలహాలకూ, సహాయానికీ, నడిపించ వలసినదనీ, కాంగ్రెసుకు విన్నపములు పంపుకొన్నారు.

"అఖిల భారత కాంగ్రెసు కమిటీవారు తమ తాటస్థ్యాన్ని పునరుద్ఘాటించుట, తమకు వీలైనంత వరకూ సహాయం చేస్తామని ప్రకటించుట తప్పకున్నది. జోక్యం చేసుకొనము అంటే కాంగ్రెసుకు ఉన్న హద్దులను అంగీకరించుట అన్నమాట.

"ఇటీవల కొంతమంది కాంగ్రెసువాదులు యిందుకు వ్యతిరేకించు చున్నప్పటికీ, సత్య—అహింసలను బట్టి నడువ వలసి వచ్చినంత కాలము కాంగ్రెసు యొక్క విధానం ఏమనగా బ్రిటిషు ఇండియాలోని యితర ప్రజలతో తమ యాజమాన్యాన్నే సమాన హక్కులను కలిగించేటట్లు సంస్థానాధీశులు తమ అధికారాలను ప్రజలకు వదలివేయడంలోనే తమ శాంతి-భద్రతలు యిమిడి ఉన్నాయి అనే విషయాన్ని సంస్థానాధీశ్వరులచే గమనింప జేయుటకు పదే పదే ప్రయత్నించడమే."

డాక్టర్ ఖరే

అఖిల భారత కాంగ్రెస్ కమిటీవారు డాక్టర్ ఖరే చర్యను ఖండిస్తూ యీ క్రింది తీర్మానాన్ని ఆమోదించారు.

"మధ్య పరగణాలలోని మంత్రివర్గపు తగాదాను పరిష్కరించడంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అవలంబించిన నిశిత, సకాల చర్యను యీ సభవారు ఆమోదించుచూ, ఈ అభాగ్యపు వ్యవహారంలో డాక్టర్ ఖరే యొక్కయు, మధ్య పరగణాల గవర్నరు యొక్కయు సదరు తల పట్ల వర్కింగ్ కమిటీ ప్రకటించిన అభిప్రాయాలను అక్షరాలా అనుమతించు చున్నారు. మంత్రి వర్గమునుండి డాక్టర్ ఖరే రాజీనామా యిచ్చిన తరువాత నుండియు అతని నడత తీవ్రతమ ఖండనార్హమైనదని అఖిల భారత కాంగ్రెస్ కమిటీవారు స్పష్టమైన అభిప్రాయాలను కలిగియున్నారు. అందుచే అతనిపై తగిన శిక్షణా చర్యను వర్కింగ్ కమిటీ తీసుకొనవలసినదని అఖిల భారత కాంగ్రెసు కమిటీవారు తీర్మానించు చున్నారు."

యుద్ధ అపాయము

"యూరప్‌లో యుద్ధం ఆరంభమైతే, ఆ పరిస్థితులలో హరిపూర్ తీర్మానాన్ననుసరించి, ఎప్పుడెప్పు డేదేది అవసరమో అప్పుడప్పుడా కార్యములను నెరవేర్చుటకు అ. భా. కాం. వర్కింగ్ కమిటీవారికి తమ అధికారాన్ని యావత్తును అ. భా. కాం. కమిటీవారు సంక్రమింప జేయుచున్నారు."

పౌరస్వేచ్ఛ

"దౌర్జన్య విధానం ద్వారా వర్గ సమరాన్ని దోపిడులు, హత్యలు, దుండగీడు తనమును, పౌరస్వేచ్ఛ పేరుతో, కాంగ్రెసు వాదులు యితరులు కూడా ప్రోత్సహించు చుండుటచేతను, కొన్ని పత్రికలు ప్రజలను దౌర్జన్యానికి ప్రోత్సహించి మత కలహాలకీ దారి తీసేటట్లు దౌర్జన్య-పూరిత ప్రచారాన్ని సాగించు చుండుట చేతను, పౌరస్వేచ్ఛ అనగా దౌర్జన్యం చేయుటగాని, అందుకు ప్రేరేపించుట గాని, వట్టి అబద్ధాలను వ్యాప్తి జేయుటగాని కాదని ప్రజలను కాంగ్రెసు హెచ్చరించు చున్నది. అందుచే, పౌరస్వేచ్ఛను గురించి కాంగ్రెస్ యొక్క విధానంలో మార్పు ఏమీ లేకపోయి నప్పటికీ, కాంగ్రెస్ సాంప్రదాయా న్ననుసరించి, ప్రాణాన్ని ఆస్తిని సంరక్షించుటకు కాంగ్రెస్ మంత్రి వర్గాలచే అవలంబింపబడు కృత్యాలను యీ కమిటీవారు బలపరచు చున్నారు."

పరిపాలనా విధానంలో జోక్యం

"ప్రభుత్వోద్యోగులను, పదవులలో ఉన్న యితరులను, బలవంతపెట్టుటకు ప్రయత్నించుట ద్వారా కాంగ్రెసు కమిటీలు దేశపు వ్యవహారాల సామాన్య నిర్వహణలో జోక్యం కలిగించు కొంటూన్నట్లు కాంగ్రెసుకు తెలిసినది. పరిపాలనా వ్యవహారములలో కాంగ్రెసు వాదులు జోక్యం కలిగించుకోవద్దని కాంగ్రెసు సలహా యిచ్చుచున్నది. అంటే, కాంగ్రెసు వాదుల సహాయాన్ని ఉద్యోగులు అర్థించినట్లయితే, దానిని నిరాకరించమని అర్థము కాదు."

బర్మా దొమ్మీలు.

"ఇటీవల బర్మాలో ప్రారంభమై, ప్రాణహాని, రక్తపాతం, ఆస్తి విధ్వంసములకు కారణమైన హృదయ విదారకమైన దొమ్మిలలో బాధలు పడుచున్న భారతీయులపట్ల యీ సభవారు తమ సానుభూతిని వెలిబుచ్చుతున్నారు. ఈ దొమ్మీలకు కారణాలను, యీ దొమ్మీలలో పోయిన ఆస్తి-ప్రాణముల విషయములో నిష్పాక్షికమైన విచారణ జరుగుతుందని అ. భా. కాం. కమిటీవారు నమ్ముచున్నారు.

నాశనం చేయబడిన ప్రార్థనా మందిరాలు తిరిగి యేర్పాటుచేయుట; దొమ్మీలలో పాల్గొన్నారని రుజువైన వారికి తప్ప బాధలు పడుచున్న మిగతా వారందరికీ తగు ముజరాలు యిప్పించుటలు; జరుగుట అవసరం అని అ. భా. కాం. కమిటీవారు అభిప్రాయ పడుచున్నారు. బర్మాలో తరతరాల నుండి నిరాటంకంగా జీవిస్తూ ఉన్న భారతీయుల వలసదారుల ఆస్తి-ప్రాణాలకు భద్రత వాగ్దానము చేయబడునని కూడా అ. భా. కాం. కమిటీ వారభిప్రాయ పడుచున్నారు.

"బర్మాకును, ఇండియాకును మధ్య చిరకాలం నుండి సఖ్యత కలదనియు, బర్మాలోని భారతీయ వలసదారులు బర్మీయులు ఇంతవరకు అన్యోన్యానురాగముతో సుఖముగా జీవించు చున్నారనియు, బర్మా మహాజనులకు యీ కమిటీవారు జ్ఞాపకము చేయుచున్నారు. ఉభయ దేశాల మధ్యనున్న సుగమ సంబంధాలను భంగపుచేటట్టి కృత్యములు ఏవియు కూడా జరుగకుండా శ్రద్ధ పూనవలసినదని బర్మీయులకు, బర్మా ప్రభుత్వానికి అ. భా. కాం. కమిటీవారు విన్నవించు చున్నారు.

"బర్మాకు వలసపోయిన భారతీయులు తమ సద్వర్తనల ద్వారా బర్మీయులతో మైత్రిని పెంపొందించు కొనవలసినదనియు, భారత దేశమునుండిగాని, భారతదేశ ప్రభుత్వం నుండి గాని సహాయం అర్థించుట కన్న బర్మీయులతో తమ సత్సంబంధాలమీద, తమ స్వశక్తిమీద ఆధారపడి యుండుట ఉత్తమమనియు అ. భా. కాం. కమిటీవారు భారతీయ వలస దారులకు సలహా యిచ్చుచున్నారు"

ఢిల్లీ, ఏ. ఐ. సి. సి. సమావేశం

కాశీపట్టణాన్ని గూర్చి పట్టాభిగారు పోలీసు రిపోర్టుల వల్లించుట

శ్రీ పి. సుందరయ్య

హరిపుర కాంగ్రెసు సమావేశము నాడు జరిగిన అఖిలభారత కాంగ్రెసు కమిటీ తిరిగి 7 నెలలకు సమావేశ మయింది ఢిల్లీలో. ఈ 7 నెలలలో దేశములో అనేక ఘటనలు జరిగాయి. వీనినిగూర్చి సింహావలోకనము చేయుటకు, కాంగ్రెసు వర్కింగుకమిటీ చేసిన పనిని కాంగ్రెసు మంత్రుల చర్యలను, పరిశీలించడానికి అ. భా. కాంగ్రెసు కమిటీ పూనుకోవలసి యుండినది.

సత్యమూర్తి ధులాభాయిలు ఫెడరేషనును కొన్ని షరతులమీద అంగీకరించ వచ్చునని అనడము, సుభాషుబాబు దానిని తీవ్రముగా ఖండించడము, ఇది జరుగబట్టి అ. భా. కాం. కమిటీ ఫెడరేషనుపట్ల (నూతన రాజ్యాంగ ప్రణాళికపట్ల) తన దృక్పథమును స్పష్టముచేస్తూ ఫెడరేషనును రాకుండ చేయడానికి దేశము ఏమి చేయవలసి యుంటుందో మార్గము సూచించునని అందరు ఎదురు చూస్తూ ఉండినారు.

మధ్య పరగణాలలో ఖరేగారి గొడవను గూర్చి వర్కింగుకమిటీ చర్యను ఖండిస్తూ అనేకులు ప్రచారము ఆరంభించడము వల్ల దీనినిగూర్చికూడ అ. భా. కాం. కమిటీ చర్చించక తప్పదని కూడ అందరు ఎదురు చూస్తూ ఉండినారు.

స్వదేశ సంస్థానాలలో రోజుకు రోజు ప్రబలమవుతూ ఉండే స్వాతంత్ర్య పోరాటాన్ని గుర్తించి, దానికి పూర్తి సహకారము చేయుటకు అ. భా. కాం. కమిటీ పూనుకోవలసి ఉంటుందని, హరిపుర కాంగ్రెసు యొక్క తాటస్థ్య తీర్మానమును మార్పు చేసుకుంటుందని ఎదురు చూచారు ప్రజలు.

గత 7 మాసాలుగా కాంగ్రెసు రాష్ట్రాలలో కూడ పౌరసత్వహక్కులకు చాల భంగము కలిగించారు. బీహారు కాంగ్రెసు జమీందార్ల ఒడంబడిక రైతులలో తీవ్ర అసంతృప్తి కలిగించినది. సరిహద్దురాష్ట్రములో 600 మంది రైతులను గలధరగ్రామములో అరెస్టుచేశారు. బొంబాయి, షోలాపూరు రాజకీయఖైదీలను, రాజకీయ ఖైదీలగాకూడ బొంబాయి ప్రభుత్వ గుర్తించలేదు. మద్రాసుకాంగ్రెసు ప్రభుత్వము రాజకీయగ్రంథాలను నిషేధించడమేగాక, క్రిమినల్ లా అమెండుమెంటు ఆక్టును ఉపయోగించడము, దానిని రద్దుచేయడానికి తెచ్చిన బిల్లును వ్యతిరేకించడము ప్రజాసామాన్యమునంతను దిగ్భ్రాంతము గావించింది. ఈ విషయాలనుగూర్చి కూడ అ॥ భా॥ కాం॥ కమిటీ ఒక ఖచ్చితమైన నిర్ణయమునకు వస్తుం దని కూడ ప్రజలు ఎదురు చూడసాగారు.

అ॥ భా॥ కాం॥ కమిటీ సమావేశమయ్యే రోజుకు యూరోపులో యుద్ధవాతావరణము ఆవరించసాగింది. కాని దీని ప్రభావముగాని, యుద్ధము వస్తుందేమో, ఆపరిస్థితులలో మనమేమి చేయాలనే ఆతురతగాని వచ్చిన సభ్యులలో కన్పడలేదు.

ఖరే విషయమై మొదటిరోజు సెప్టెంబరు 24 న తారీఖున చర్చసాగింది. కమ్యూనిస్టులు, సోషలిస్టులు ఖరే చర్యను ఖండించడములో వర్కింగుకమిటీతో ఏకీభవించారు. కాని బాలకృష్ణశర్మ ఖరేమీద డిసిప్లినరీచర్య తీసికోవలిసినదిగ సవరణ తెచ్చినప్పుడు, అది చాల కఠినశిక్ష అని వ్యతిరేకముగా ఓటుచేశారు. భూపేంద్రనాథ్‌సన్యాలు, యం. యన్. రాయి ఖరే చర్యను ఖండించినా వర్కింగు కమిటీమీద రాజాజీమీద ఖరేతెచ్చిన నేరారోపణలను విచారించడానికి ఒక కమిటీని నియమించమన్నారు. ఖరే గొడవతో దానిని ముడివేయబట్టి సోషలిస్టులు, కమ్యూనిస్టులు, కిసాను గ్రూపు దీనిని బలపరచజాలక పోయింది. ఖరేమీద చర్చ మరుచటిరోజున 25 వ తారీఖునకూడ జరిగింది. అనవసరంగా చచ్చిన పామును ఇంతదూరము కొట్టడ మెందుకనే భావము కొందరికి కల్గింది. అనేక ప్రధానసమస్య లున్నప్పుడు ఈవిషయమునుగూర్చి ఇంత దీర్ఘ చర్చ జేయడము కేవలము వృథాగాక మరేమి?

కామ్రేడ్ అల్లూరి సత్యం పైని డిసిప్లినరీ చర్యను గూర్చి కృపాలినీతో వ్యక్తిగతంగా మాట్లాడినపుడు అ. భా. కాం. కమిటీ సభ్యునిపై రాష్ట్రకాంగ్రెసు కమిటీ, వర్కింగ్ కమిటీ అనుమతి లేనిదే చర్య తీసుకోకూడదనియు, కామ్రేడ్ సత్యం విషయములో అట్టి అనుమతి పొందలేదని చెప్పాడు. కాని ఆవిషయాలనే బహిరంగంగా చెప్పించడానికి కామ్రేడ్ కామేశ్వరరావు లేచి ప్రశ్నించాడు గాని, చూచిచూడనట్లు, అధ్యక్షుడు ఖరేమీద తీర్మానమును ప్రతిపాదించుటకు డా॥ పట్టాభిని పిలిచినాడు. కామేశ్వరరావు వైపు అప్పుడు డాక్టరు పట్టాభి చేసిన హస్త విన్యాసము చూడవలసినదే. ఫెడరేషను తీర్మానము మీద కాం॥ సో॥ పార్టీతరపున. మున్షీ అహమ్మద్‌దీన్ ఈక్రింది సవరణను ప్రతిపాదించాడు.

"భరింపరాని ప్రస్తుతస్థితిని అంత మొందించుటకు కాంగ్రెసు, ఉద్యమమును ముందుకు సాగుటకును సంపూర్ణ స్వాతంత్ర్య సంపాదనకు ప్రత్యక్ష పోరాటానికి పూనుకోవలసిన కాలము వచ్చింది."

వర్కింగు కమిటీ తీర్మానము, హరిపుర కాంగ్రెసులో ప్యాసయిన ఫెడరేషను తీర్మానమును బలపరుస్తూ ప్రస్తుతమున్న బాధ్యతారహితస్థితి కొనసాగితే, తప్పక దేశములో విషమస్థితి వస్తుందనియు, ఆవిషమస్థితిని రాకుండా వాయిదా వేయుటకు అందరూ కోరుతున్నామనియు, చెప్పింది.

"అందరూ ఈ విషమస్థితిని లేకుండ వాయిదా వేయుటకు కోరుతున్నా"మనే మాటలు ఫెడరేషను విషయములో రాయబారాలకు దారితీస్తూ ఉందనీ అతివాదులు విమర్శించారు. మనకు కావలసినది ఫెడరేషనులో కొద్ది మార్పులుగావు; యుక్తవయస్సు వచ్చిన జనసామాన్య మంతటిచే ఎన్నుకోబడిన కాన్‌స్టిట్యుయంటు అసెంబ్లీచే నిర్ణయించబడే రాజ్యాంగ విధానము. ఇది బ్రిటిషు ప్రభుత్వముతో రాయబారాలు జరిపితే కాదువచ్చేది. బ్రిటిషు ప్రభుత్వముతో పోరాటము (Struggle) సాగిస్తేనే సాధ్యమవుతుందని దత్తు మజుందారు, తన సవరణను ఉపపాదిస్తూ మాట్లాడారు. చాల ఉద్రేకపూరితమైన ఉపన్యాస మిచ్చాడు.

యమ్. యన్. రాయి ప్రతి రాష్ట్రములో డెడ్‌లాక్సు (ప్రతిష్టంభనలు) కల్గించ వలయుననియు, దానికోసం కాంగ్రెసు మంత్రులు రాజీనామా నివ్వవలయుననియు సవరణ ఉపపాదించారు. దీనికి కమ్యూనిస్టులుగాని, సోషలిస్టులుగాని ఓటు చేయలేదు. మంత్రులు ప్రతిష్టంభనము కోసము రాజీనామా ఇవ్వకూడదు. మంత్రులు ప్రజా కోర్కెలకు గవర్నరు అడ్డము వచ్చినపుడే రాజీనామా ఇస్తే ప్రజా పోరాటము పెంపొందునని సోషలిస్టుల అభిప్రాయము. మంత్రులు రాజీనామా ఇవ్వవలయుననుటే ప్రజాభిప్రాయము నేడు కాంగ్రెసు మంత్రులు తమ పదవులలో ఉండి తమ కష్టాలను తీర్చాలని ఎంత ఎక్కువగా ఉందో గ్రహించలేక పోవడమే.

దత్తు మజుందారు సవరణను బలపరుస్తూ స్వామి సహజానంద, రంగాగార్లు, మున్షీ అహమ్మద్దీన్ సవరణనుబలపరుస్తూ మాటాడారు. డాక్టరు జడ్, ఏ.అహమ్మదు మాట్లాడిన పిదప సవరణలన్నీ నిరాకరించ బడ్డాయి.

దత్తు మజుందారు సవరణలో కాంగ్రెసు సోషలిస్టుల సవరణలోలేని సూచన ఒకటి అఖిల భారత దినాన్ని ఫెడరేషనుకు వ్యతిరేకముగా జరుపమని ఉంది. ఈ సూచనను కాంగ్రెసు సోషలిస్టులు అంగీకరించలేదు. ఇట్టి విషయాలలో కూడ సోషలిస్టులు, కమ్యూనిస్టులు వేరే వేరే సవరణ లుపపాదించడము, అతివాదులలో చీలికను ప్రతివానికీ తెలియజేసింది. దీనివలన చాల నిరుత్సాహము కలిగింది.

ఈనిరుత్సాహము, స్వదేశ సంస్థానాల విషయము కాంగ్రెసు వర్కింగు కమిటీ తీర్మానము గెలువడము, సోషలిస్టులు, కమ్యూనిస్టులు, కలిసి ప్రతిపాదించిన సవరణ లన్నింటినీ వల్లభాయి, చేతులు ఎత్తి దింపకముందే ఓడిపోయాయని ప్రకటించడము, వీనితో మరింత ఎక్కువయింది. దీనికితోడు, సంస్థానాలను గూర్చిన తీర్మానములో సంస్థానముల యెడల తమ తాటస్థ్యమును మరియొకమారు వర్కింగు కమిటీ తెలియజేశారు. అయితే, కాంగ్రెసుకు వీలైన ప్రతిపద్ధతి ద్వారా సంస్థాన ప్రజలకు సహకారము చేయవలయునని, తెల్పింది. కాని స్వదేశ సంస్థానాధీశులతో కాంగ్రెసు నీతి స్నేహముతో ఉండుటయని ప్రకటించింది, అంతేగాక స్వదేశ సంస్థానాధీశుల హృదయ పరివర్తనము కోసం ఎప్పుడూ ప్రయత్నిస్తూ ఉండడమే కాంగ్రెసు నీతియని ప్రకటించింది, అవిధంగా ప్రయత్నించనిచో "సత్య అహింసల"కు వ్యతిరేకంగా పోవడమనేటట్లు చెప్పింది. తిరువాన్కూరులో బాధ్యతాయుత ప్రభుత్వమును ఇవ్వడానికి గాక, అట్టి ప్రభుత్వాన్ని ఏర్పరచుటకు ఎట్టి అవకాశములున్నవో పరిశీలించడానికి ఒక కమిటీని కోరింది. ఈ తీర్మానం హరిపుర కాంగ్రెసు తీర్మానమునున కన్న కొన్ని విషయాలలో వెనక్కి పోయింది. స్వదేశ సంస్థానాల స్నేహముగాని, హృదయ పరివర్తనగాని హరిపుర కాంగ్రెసు తీర్మానములో లేవు. ఇప్పుడు అవి తాటస్థ్యముతో బాటు కాంగ్రెసు సిద్ధాంతము లయినవి.

దీనికి అతివాదులనేక సవరణలు కలిసి చేశారు. గాని ఏమీ లాభం లేక పోయింది. ఇవి కూడ నిరుత్సాహమును మరింత ప్రబలము చేసింది.

మూడవ రోజు సమావేశ మయినపుడు కాంగ్రెసు వర్కింగు కమిటీ, నిర్మాణ విధానములో కొన్ని మార్పులు సూచించినది. దీని వలన అ. భా. కాం. కమిటీకి ఎన్నికలు మెజారిటీ ఓటు ప్రకారము ఎన్నుకుంటారట. ప్రస్తుతమున్న సింగల్ ట్రాన్స్ఫరబుల్ పద్ధతి మానివేస్తారట. దీని అర్థము కాంగ్రెసు కమిటీలలోకి అతివాదులను రానివ్వకుండా ప్రస్తుతము అధికారములో నున్న వారు చేయుటకు వీలవుతుంది.

అతివాదులు సూచించిన సవరణ అంగీకరించడమువల్ల యుద్ధ తీర్మానము ఏకగ్రీవంగా అంగీకరింప బడింది. మొదట తీర్మానము వర్కింగు కమిటీకి సర్వాధికారాలిచ్చునట్లు తేబడింది. సవరణ ప్రకారము, యుద్ధము వస్తే బ్రిటిషు ప్రభుత్వానికి సహాయము చేయకూడదనే హరిపుర కాంగ్రెసు తీర్మానం ప్రకారం పని చేయుటకు మాత్రమే ఈ వర్కింగు కమిటీకి అధికార మివ్వబడింది.

పాలెస్టయిను మీద, బర్మా మీద, బుగ్తి సంస్థానముమీద తీర్మానాలు ప్యాసయిన పిదప, సభ్యులు నోటీసిచ్చిన తీర్మానాలు తీసుకోబడ్డాయి. డాక్టరు అష్రాఫ్ యొక్క హిందుస్థానీ తీర్మానము చర్చకు వచ్చింది. అధ్యక్షుడు చర్చ జరుగుటకు ముందే 8 గంటల వరకు సభ్యుల తీర్మానాల మీద చర్చ జరుగుననియు తదుపరి తిరిగి వర్కింగు కమిటీ తీర్మానాలపై చర్చ జరుగుననియు ప్రకటించాడు.

అందుచే సభ్యులందరు తాము నోటిసిచ్చిన తీర్మానాలలో ఎన్ని ఎక్కువ చర్చించడానికి అవకాశ ముంటుందో అన్నింటిని చర్చించడానికి ఆతురత చూపసాగారు. కాని హిందూస్థానీ తీర్మానము మీద, వర్కింగు కమిటీ సభ్యులు, అధ్యక్షుడు కావాలని అనవసరముగా చర్చను పొడిగించ సాగారు. సభ్యులలో నిరుత్సాహము కోపముకూడ రాసాగింది. తమ కాలాన్ని ఈవిధంగా దుర్వినియోగము చేస్తూ ఉన్నందులకు మండిపడిరి. అయితే చేసేదేమిటి?

ఎట్లయితేనేమి హిందుస్థానీ తీర్మానము ఓడిపోయింది. 10 ఓట్ల భేదముతో. కాని ఇప్పుడు వర్కింగు కమిటీ ఆ తీర్మానమునే ప్యాసు చేస్తూ, అ. భా. కాం. కమిటీ, అసలు తీర్మానానికి తెచ్చిన సవరణల మూలంగా ఆ తీర్మానాన్ని ఓడించిందని సమాధానము చెప్పారు. ఇంతకైనా సంతోషమే. తిరిగి ముస్లిమ్‌కమ్యూనిస్టు నాయకులకు అవకాశము కలిగించనందులకు.

హిందూస్థానీ తీర్మానము పిదప, ముస్లిం లీగుతో రాయబారాలు జరిపినందులకు అసంతృప్తి తెలుపుతూ మున్షీ అహమ్మద్దీన్ తీర్మానమును ఉపపాదించాడు. క్రామేడ్ మసానీ అతీర్మానాన్నే మరియొక రూపాన సూచించాడు. దత్తుముజుందార్, అసలు రాయబారా లారంభించడము మంచిదేయైనను, దానిని రహస్యముగా సాగించడము మంచిది గాదని మరియొక సవరణ ఉపపాదించాడు. అతివాదులలో ఎక్కువ సుందికి దత్తు ముజుందార్ సవరణ సరియైన దనే అభిప్రాయమున్నా, భేదాభిప్రాయాలకు తావిచ్చే ఈ స్థితి చూచి చాల విచారపడ్డారు. అంతే గాక వర్కింగు కమిటీ సభ్యులు వీరిని హేళన గావించారు కూడ. వీనితో అతివాదులకు వచ్చింది.

ఈ కోపానికి సహాయకముగా అన్నట్లు పౌరసత్వ హక్కుల మీద తీర్మానము, పరిపాలనలో కాంగ్రెసు కమిటీలు జోక్యము కలిగించుకుంటున్నాయి. అట్లు అడ్డు తగులకూడదనీ కేవలము ఉద్యోగులు కోరినట్లయితే వారికి సహాయము చేయాలని మరియొక తీర్మానమును తెచ్చారు. పౌరసత్వ హక్కులమీద తీర్మానము,కొంతమంది కాంగ్రెసువాదులు, హత్యలు దోపిడి, వర్గ కలహాన్ని, రేకెత్తించడానికి వచ్చి అబద్ధాలు చెప్పుతూ ఉపన్యాసా లిస్తున్నారట! పౌరసత్వ హక్కుల పేరిట ఇదంతా గావిస్తారట! ఇలా చేస్తే ఆస్తులను రక్షించడానికి, ప్రాణాలను రక్షించడానికి కాంగ్రెసు ప్రభుత్వాలు పూనుకుంటాయి జాగ్రత్త సుమా అని బెదరించింది.

అప్పటికే రాత్రి 9-30 గంటలయింది. భోజనానికి ఒక గంట వ్యవధి నిచ్చి తిరిగి సమావేశమవుతామనే సూచనకు వర్కింగు కమిటీ సభ్యులు వ్యతిరేకించారు. వారి రెండు తీర్మానాలు, త్వరలో ప్యాసు చేయించి పోతామను కున్నారు. అతివాదులకు బాగా కోపం వచ్చింది. పౌరసత్వ హక్కులను కాంగ్రెసు ప్రభుత్వాలు సంకుచిత పరుస్తున్నప్పుడు, ఈ విధంగా చేయకూడదని ఒక ముక్క కూడ లేకుండా, పైగా కాంగ్రెసు వాదులు వర్గ కలహాన్ని ఖూనీలను, దోపిడీలను ప్రోత్సహిస్తున్నారని నిందవేయడముతో ఏమైనా సరే, వర్కింగు కమిటీకి తమ అభిప్రాయాన్ని ఒక్క పర్యాయము తెలియజేస్తామన్నారు. అప్పటికప్పుడు సవరణలు వ్రాసి పంపసాగారు. బంకిం ముఖర్జీ, దత్తు మజుందార్, మసానీ, స్వామి సహజనంద, రంగా, డాక్టరు అహమ్మద్, కరాచీ సింధు సోషలిస్టు సభ్యుడు, ఇంకా కొంతమంది సవరణలు పంపించారు.

బుల్లుభాయి అసలు వర్కింగు కమిటీ తీర్మానాన్ని ఉపపాదిస్తూ, ఆస్తుల దోచుకోమనడము, ఖూనీలు చేయమనడము, వర్గ కలహాన్ని రెచ్చగొట్టడము, ముఖ్యంగా ఆంధ్ర, బీహారు సంయుక్త రాష్ట్రాలలో ఉందన్నాడు.

బంకిం ముఖర్జీ కాంగ్రెసు ప్రభుత్వాలలో కొంత వరకు పౌరసత్వ హక్కులు పెరిగినా వాటిని సంకుచిత పర్చుచూ ఈ మధ్య జరిగిన కొన్ని ఉదాహరణలనిస్తూ, ఈ విధంగా చేయడమువల్ల, పంజాబు బెంగాలు లాంటి కాంగ్రెసేతర రాష్ట్రాలలో, నిర్బంధ విధానము మరింత హెచ్చవుతుందని ఉపన్యసించాడు. దత్తు మజుందారు ఉపన్యసిస్తూ కాంగ్రెసు వర్కింగు కమిటీ ఆస్తి ప్రాణాలను రక్షించడానికి పూనుకుంటామని చెప్పుతూ ఉంది. చీరాల కాల్పులు దానికి నిదర్శనమా అని అడిగాడు.

యు. పి. లోను, బీహారులోను సరిహద్దు రాష్ట్రాలలోను జమీందారులు రైతుల ఆస్తులను లాగుకొంటూ ఉంటే ఏమి చేసింది? కాంగ్రెసు సభ్యులు వర్కింగు కమిటీ చెప్పినట్లు దౌర్జన్యాన్ని పురిగొల్పుతూ ప్రచారము సాగిస్తే ఈ డిసిప్లినరీ చర్య ఎందుకు తీసుకోలేదు? ఎవరెవరు ఎట్టి ఉపన్యాసాలిచ్చింది సాక్ష్యము ఏమీలేక, కేవలము పోలీసు రిపోర్టులమీద ఆధారపడి ఈలాంటి తీర్మానము తేవడము కేవలము అ. భా. కాం. కమిటీ సభ్యులమీద ఘోర నీలాపనింద (slander) వేయడము గాక మరేమీ కాదన్నారు. యుద్ధము రాబొయ్యే పరిస్థితులలో ఫెడరేషనును ఎదుర్కొడానికి తీవ్ర పోరాటాన్ని సాగించాలసిన స్థితిలో ఈలాంటి తీర్మానము తేవడము బ్రిటిషు ప్రభుత్వమునకు స్వాతంత్ర్య పోరాటాన్ని అణచడానికి వీలు దొరుకుతుందన్నారు.

స్వామి సహజానంద మాట్లాడుచు ఈలాంటి తీర్మానాలు సాక్ష్య మేమీలేక పోలీసు రిపోర్టు మీద ఆధారపడుతూ తేవడము చాల తప్పన్నాడు. ఫ్రాంటియరులో తోరు నవాబుయొక్క అక్రమ వసూళ్ళను ఆపక వందలకొలది రైతులను, సోషలిస్టులను అరెస్టు చేయడము, బీహారులో రైతులను బెదరించడానికి పోలీసులను గ్రామాల వెంట త్రిప్పడము, వందల కొలది రైతు వర్కర్లమీద 107 సెక్షను క్రింద కేసులు పెట్టడము కాంగ్రెసుకు గౌరవము కాదు తీర్మానాన్ని సభ్యులందరికి సర్క్యులేటు చేయమన్నాడు.

డాక్టరు అహమ్మద్దీన్, కాంగ్రెసు సభ్యులు కొందరు దౌర్జన్యాన్ని పురిగొల్పుతూ ఉపన్యాసమిస్తే అది కాంగ్రెసు ఆశయానికి విరుద్ధము అయినా, తగిన సాక్ష్యమును సభ్యులకు అందచేయుటకు, అట్టి సాక్ష్యాన్ని పరిశీలించడానికి వర్కింగు కమిటీకి ఈ తీర్మానమును తిరిగి పంపడమైనదనే సవరణ ఉపపాదించాడు.

తీర్మానమును వర్కింగు కమిటీ సభ్యులకు మెజారిటీ ఉండబట్టి ప్యాసు చేయవచ్చు గాని దానితో ఈ విషయము అంతము కాదు. మద్రాసులో పుస్తకాలు నిషేధిస్తూ ఉన్నారు. షోలాపూరు ఖయిదీలను రాజకీయ ఖయిదీలుగా పరిగణించడము లేదు. మద్రాసులో కాంగ్రెసుసభ్యుల మీద పోలీసుల నిఘా మామూలుగానే సాగుతూంది. దీన్ని గురించి వర్కింగుకమిటీ మౌనమెందుకు వహించి ఉంది? ఇదేవిధంగా సాగితే మే మిచ్చట స్వల్పసంఖ్యాకులమైనా దేశములో అగ్నిజ్వాల ముట్టించగలము.దానిలో వర్కింగ్ కమిటీయొక్క ఈ దృక్పథము మారక తప్పదన్నాడు.

రంగాగారు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రములో దౌర్జన్యము పురిగొల్పుతున్నారనే నేరము పోలీసు రిపోర్టులలోది అన్నాడు. కృపాలినీ, కాదు డాక్టరు పట్టాభి రిపోర్టు అంటే, వెంటనే రంగాగారు, అలాగా, అయితే ఇంకా అన్యాయమన్నాడు. సోషలిస్టులపై పగ సాధించడానికి ఎత్తు గూడ మొదలుపెట్టాడా అన్నారు.

రాయ్, తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెసు ఆశయము (Creed) ను మార్చుకోనంతవరకు, కాంగ్రెసు కార్యక్రమమును ఆచరణలో బెట్టడానికి సాధ్యము గాదన్నారు. డాక్టరు పట్టాభి తీర్మానాన్ని బలపరుస్తూ, ఆంధ్ర రాష్ట్రములో కాళీపట్నపు జమీందారీ భూములను ఆక్రమించుకోమని కాంగ్రెసు సభ్యులే ప్రచారము చేస్తున్నారన్నాడు. ఆంధ్ర సోషలిస్టు సభ్యులు వెంటనే లేచి "డాక్టరు పట్టాభి గారూ, మీరు రాత్రి రహస్యముగా తహసీల్దారువద్దకు వెళ్ళి పుచ్చుకొన్న స్టేటుమెంటునుండీ, పోలీసు రిపోర్టునుండీ ఈ విషయాలు ఏకరవు పెట్టుతున్నారు సుమా!" అన్నారు. పట్టాభిగారు దిగాలుపడ్డారు.

నరేంద్రదేవు తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ, యు. పి. లో జమీందార్లు రైతులను తరిమివేస్తూంటే కాంగ్రెసువారు ఏమి చేశారనీ, ఇట్టి తీర్మానాన్ని తేవడము శుద్ధ తప్పన్నారు. గోవింద వల్లభ పంతు మాట్లాడుతూ యు. పి. లో పౌర స్వేచ్ఛ కోసం తాము చేసిన పనులన్నీ చెప్పాడు. కాన్పూరును ఉదహరించాడు. పంజాబులో ప్రకటించడానికి వీలులేకపోతే కీర్తిలహరు అనే ఉర్దూ గురుముఖి పత్రికలు మీరటు నుండి ప్రకటిస్తూ ఉన్నా రన్నాడు. మా రాష్ట్రములో పౌరస్వేచ్ఛ లేదనడము అన్యాయమన్నాడు. ఒక సభ్యుడు లేచి మీ రాష్ట్రాన్ని గూర్చిగాదు. "బొంబాయి, మద్రాసు, సరిహద్దు రాష్ట్రాలను గూర్చి ఈ విమర్శన. అంతేగాని ఈ తీర్మానము ప్యాసు చేస్తే మీ రాష్ట్రములో కూడ ముందేమి జరుగుతుందో" అన్నాడు.

వల్లభభాయి మాట్లాడుతూ మిమ్ముల జెయిళ్ళకు పంపి మేమిచట నుండుటకు కాదు మేమీ తీర్మానము తెచ్చిందన్నాడు. ఒక సభ్యుడు కార్మిక శాసన సభ్యుల ఓటుతో బొంబాయిలో మెజారిటీ మాకుందన్నారు. ఈరోజు బొంబాయి శాసన సభలో కాంగ్రెసుకు వ్యతిరేకంగా కార్మిక సభ్యులు పోట్లాడుతూ ఉన్నారు అని వల్లభభాయి అనగానే "అవును కార్మికుల సమ్మె హక్కును నాశనము గావించే కార్మిక బిల్లును వ్యతిరేకించరూ మరి?" అన్నారు, వల్లభభాయి ఉపన్యాసము సాగిస్తూ రేపు యుద్ధము వస్తే అ. భా. కాం. కమిటీ ఉండదు. వర్కింగు కమిటీ ఉండదు. మమ్ముల అనుమానించవద్దు. మనమంతా కలసి పని చేయాలన్నాడు. ఏమిటి? వల్లభభాయి ఇంత సౌమ్యంగా మాట్లాడం ఎలా సంభవించింది? ఆయన ముఖమునుండి కూడ ఐక్య సంఘటనమా? అని ఆశ్చర్యపడ్డారు సభ్యులు. తీవ్రవాదులు ఉపన్యాసాలు ఇస్తూ ఉన్నంత సేపు కాంగ్రెసు మంత్రివర్గాలు గావించే తప్పులను వాటి ప్రమాదాలను తెలియజేసినప్పుడెల్లా ప్రజలు "అవమానము". "అవమానము" "వినుడు వినుడు" అనే కేకలు వేస్తు వచ్చారు. పాపము! సత్యమూర్తికి కోపము వచ్చింది. సభ్యులు కానివార్ని అరవకుండా చూడమని అధ్యక్షునికోరాడు. అయితే ఆఉద్రేక పూరిత ఉపన్యాసాలలో, వర్కింగు కమిటీ ఈ తీర్మానము చేస్తే, ఎట్టి త్యాగానికైనా, వెనుదీయమనీ, మమ్ముల బెదరించ జాలరనీ, ఛాలెంజీల వెనుక ఛాలెంజులు వెలువడుతూ ఉన్న ఆ సమయములో రాత్రి 2 గంటలప్పుడు సత్యమూర్తిని లక్ష్యముచేసే దెవరు?

డాక్టరు అహమ్మదు సవరణకైనా అంగీకరిస్తారేమోనని దత్త మజుందారు సవరణలమీద ఓట్లు తీసుకొంటూ ఉన్నప్పుడు అడిగాడు. వర్కింగు కమిటీ ఒప్పుకొన్నది. దానిలో దత్త మజుందారీ విధంగా ప్రకటించాడు.

"అధ్యక్షునియందు మాకెంత గౌరవమున్నా, కాంగ్రెసుయందు మాకు ఎంత విశ్వాసమున్నా, ఈ తీర్మానముమీద ఓటు చేయుట అవమానకరమని మేము భావిస్తున్నాము. అందుచే ఈ సభనుండి వెళ్ళిపోతున్నామని"

అతివాదులందరూ, తమ భేదాలను మరచి లేచి పోయారు. వారితో పాటు చాల మంది ప్రజలు, వాలంటీర్లు కూడ బయటకు వెళ్ళి విప్లవ నినాదాలతో వచ్చారు. ఈ ఐక్యత ఫలితమే వర్కింగు కమిటీకు "కాంగ్రెసు కమిటీలు పరిపాలనకు అడ్డు తగులరాద"నే తీర్మానాన్ని పెట్టక సభను చాలించడం. పాపము! వర్కింగు కమిటీ ఇంత వ్యతిరేకత వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు!

మరియొక్క విషయము. కాంగ్రెసు నిబంధనల మార్పులు చర్చకు తీసుకురాలేదు. కారణము, సుభాసు వ్యతిరేకించాడు. అంతే గాక బెంగాలులో గాంధి గ్రూపువారు అల్ప సంఖ్యాకులు గాబట్టి వా రీ సూచనలు నష్టము కలిగించునని వ్యతిరేకించారట! ఇదే ఆ సూచనలను తాత్కాలికముగా విరమించుకోడానికి చాల పని చేసిందని కూడ సభ్యులనుకున్నారు.

జక్ బలి రష్యాపై దాడికి దోహద మిచ్చింది.

రాయబారాల విఫలత

ఆ నాడు ఆస్ట్రియాను దిగ్మ్రింగిన నాడే హిట్లరుకు జకోస్లోవేకియాపై కన్ను పడింది. చిర్రు రగిల్చి రగిల్చి మేలో ఒక బెదరింపు బెదరించాడు హిట్లర్. ఆ నాడు ఇప్పటి లాగా ఫ్రాంసు లొంగలేదు. ఫ్రాంసు కొసరమని-జకోస్లోవేకియా కోసం గాక పోయినా—బ్రిటన్ కొంచెం గట్టిగా నిలబడవలసి వచ్చింది. బ్రిటన్ ఈ దృఢ నిశ్చయానికి ఆ నాడు హిట్లరు లొంగి పోయాడు. కాని అ నాటినుండి ఆందోళన హెచ్చు గావించుతూనే వచ్చాడు. ఒక్క దెబ్బ గొట్టకుండా వీలైతే వట్టి 'బ్లఫ్'తోనే జకోస్లోవేకియాను మ్రింగ దలచాడు. మళ్ళా ఆగస్టులో ఆందోళన తీవ్రతరం గావించాడు.

ఫాసిస్టు పక్షపాత బుద్ధి గల ఛాంబర్లేను రన్సిమన్ ప్రభువును జకోస్లోవేకియాకు పంపారు. మొదట అనధికార సభ్యుడే నన్నారు. కాని అందరకు తెలిసిన రహస్యమే.

రన్సిమన్ జకోస్లోవేకియాలో అడుగు బెట్టిన నాటి నుండి, సుడెటన్ జర్మనులతో—హెన్లిన్ పార్టీ సభ్యులతో రహస్య సంప్రదింపులు గావించాడు. జకోస్లోవేకియాను లొంగేటట్లు ఎన్నో ప్రయత్నాలు గావించి కొంత వరకు సఫలీ కృతుడయాడు. కాని బ్రిటన్ ప్రోత్సహించిన కొలదీ జక్ జర్మనులు బిర్ర బిగియ సాగారు.

ఒక ప్రక్క రాయబారాలు జరుపుతూ ఉండగానే, హిట్లర్ రహస్యంగా ఆయుధాలు పంపసాగాడు.అంతర్యుద్ధానికి ప్రోత్సహించాడు. సుడెటన్ జర్మనుల నాయకుడు హెర్ హెన్లిన్ మాటిమాటికి హిట్లర్‌తో స్వయముగా కలిసికొని, అతని ఆజ్ఞానుసారం పని చేయసాగాడు. తాను కార్లస్బాడ్ వద్ద కోరిన కోర్కెలనేగాక మరికొన్నిటి కోర నారంభించాడు. చివరకు రన్సిమన్ రాయబారం విఫలమయింది.

అంతర్యుద్ధం ప్రారంభమయింది. హెన్లిన్ జర్మనీకి పారిపోయాడు. వలంటీర్ల పేరిట వేలకొలది జర్మన్ సైన్యాలు జక్ లో ప్రవేశింప సాగాయి. సుడెటన్ జర్మనులు జర్మనీకి పారిపోవ సాగారు. అంతర్యుద్ధం తీవ్రమైంది. ఘర్షణలచేత ఇరుపక్షాలలో కొద్దిమంది మరణించారు. జక్ ప్రభుత్వం చాల జాగ్రత్తగా ఆప్రదేశాలన్నిటిని తన స్వాధీనంలో ఉంచుకొన్నది.

కాని,హిట్లర్ ఉపన్యాసాలమీద ఉపన్యాసాలు దంచసాగాడు. ఫ్రాంసు సైనిక సన్నాహాలు గావించింది. అన్ని దేశాలు యుద్ధం వస్తుందేమోనని, సన్నాహం గావింప మొదలుపెట్టినయి. ప్రజల ఒత్తిడి ఎక్కువ కాజొచ్చింది. ఫ్రాంసు, యుద్ధానికి దిగితే తప్పక బ్రిటన్ దాని ప్రక్కన నిలబడి పోరాడ వలసి వస్తుంది. అందుచే బ్రిటిష్‌ప్రధాని ఛాంబర్లేను స్వయంగా హిట్లర్ వద్దకు వెళ్లాడు. అతడు కొన్ని కోర్కెలను కోరాడు. వాటి ననుసరించి బ్రిటన్ ఫ్రాంసులు గూడుపుఠాణీచేసి, జకోస్లోవేకియాను కొంత బలి యొనర్చడానికి తయారైనాయి. చరిత్రలో కనీ వినీ ఎరుగని త్యాగానికి సైతం జక్ ప్రభుత్వం సమ్మతించింది. రష్యా ఎంత సహాయం గావించ దలచినా ఏమి లాభం? ఫ్రాన్సు బ్రిటనుకు లొంగిపోజొచ్చింది. ఫ్రాంసు బ్రిటనుల ఈ లొంగుబాటు జూచి హిట్లర్ మరింత విజృంభించాడు—ఛాంబర్లేను రెండవసారి ప్రయాణం గావించినపుడు జకోస్లోవేకియా పటంలో కొన్ని గీతలు గీసి 'ఇవి నావి' అన్నాడు.


బ్రిటన్ ఆశ్చర్యపడింది. అయినా జక్ ప్రభుత్వానికి పంపింది. జక్ ప్రభుత్వం ఆ క్రూరమైన షరతులకు ఒప్పుకోలేదు.

ఇక బ్రిటిష్ పార్లమెంటును సమావేశపఱచాడు ఛేంబర్లేను. దానిలో జకోస్లోవేకియాకు, తమకూ సంబంధం లేనట్లు, దానికోసరం యుద్ధం చేయడం తెలివి తక్కువ యన్నట్లు, మాట్లాడాడు. ఏయే పరిస్థితులలో జర్మనీ ఎలా మారిందో కూడ తెల్పాడు. ఆతని ఉపన్యాసం, కార్మికపక్ష నాయకుడు అగు అట్లీకి సైతం నచ్చింది. హిట్లర్ అక్టోబర్ 1 వ తేదీకి వాయిదా వేశాడు. ఛేంబర్లేను ఈ నిరాశాపూరిత ఉపన్యాసం ప్రపంచాన్నంతా కలవరపెట్టింది. ప్రపంచ యుద్ధం తప్పదని అందరూ భయపడ సాగారు.

హిట్లర్, తన 'అల్టిమేటం'ను 24 గంటలకు వాయిదా వేశాడు.

మ్యూనిక్ సమావేశం

మ్యూనిక్‌లో సమావేశం గావడానికి ఫ్రెంచి, బ్రిటన్, ఇటలీలను హిట్లర్ పిల్చాడు. ఆయా దేశ ప్రధానులూ ఇటలీ నియంతతో గూడ కలిసి జకోస్లోవేకియాను బలి యొనర్ప సంసిద్ధులయారు. అక్టోబరు



1 వ తేదీన జర్మన్ సైన్యాలు జకోస్లోవేకియా ప్రవేశించేటట్లును, 10 వ తేదీ నాటికి ఆక్రమణ పూర్తియగునట్లును ఈ నాల్గు రాజ్యాల ఒడంబడిక ఫలితం. మిగిలిన జకోస్లోవేకియా రక్షణ గురించిగాని, దాని ఆర్థిక పరిస్థితులను గురించిగాని, ఏమీ హామీ నివ్వలేదు. ఈ షరతులను గురించి ఆలోచించేందుకైనా అవకాశం లేదు. జకోస్లోవేకియా లొంగి పోయింది. ఈ విధంగా ఒక ఓడి పోయిన దేశం అన్ని షరతులకు ఒప్పుకొన్నట్లు బ్రిటిషు ఫ్రెంచి దేశాల ద్రోహానికి జక్ బలి అయి పోయింది.

జర్మనీయే గాక, పోలండు కూడ తన వంతు తాను దిగి మ్రింగింది. ఇక మిగిలినది హంగేరీ. ఇది కూడా ఆందోళన గావిస్తున్నది. ఇంకా వృథాగా డాక్టరు బీనెస్, ఫ్రెంచి, బ్రిటిషు ప్రజలకు యెన్ని విజ్ఞప్తులు గావించుతున్నా ఏమి లాభం.

మ్యూనిక్ సమావేశ అనంతరం మరొక చారిత్ర్యాత్మక ఘటన జరిగింది. అది బ్రిటన్, జర్మనులు ఒకరిపై ఇక ముందు కత్తి కట్టా కుండా ఉండటం. ఇది ఎంత వరకు ఆచరణలో ఉంటుందా అని కాదు ప్రశ్న. జకోస్లోవేకియాకు ఫ్రాంసు గావించిన వాగ్దానం ఏమైంది? అయినా ఈ సంధి వలన జరిగిన భవిష్యత్‌లో జరిగే దేమిటి?

భవిష్యత్తు

మ్యూనిక్ సమావేశంలో, రష్యా గాని, జకోస్లోవేకియా గాని పిలపబడలేదు. ఈ నాల్గు రాజ్యాలు ప్రత్యేకమైన ఒడంబడికకు రాక పోయినా, జకోస్లోవేకియా విషయమై ఒకే నిర్ణయానికి వచ్చాయి. రష్యాను దూరమొనర్చాడు. ఇది నాల్గు రాజ్యాల ఒడంబడికకు పునాది అవుతుంది.

ఇక ఆంగ్లో-జర్మనీ సంధి వలన ఫలితం ఏమిటి? ఫ్రాంకో-సోవియట్ సంధి భగ్నం గావడానికి గొప్ప అవకాశాన్ని ఇవ్వడం. ఉదాహరణకు తక్కిన జకోస్లోవేకియా పైన గాని, లేక రష్యాలో యుక్రెయిన్ ప్రాంతాలమీదగాని హిట్లర్ దండెత్తుతాడనుకోండి, రష్యాతో తాను జేసికొన్న ఒడంబడిక ప్రకారం ఫ్రాన్సు వాళ్ళ తరపున నిలబడాలి. ఫ్రాంసు రష్యా తరపున నిలిస్తే, బ్రిటన్ అంటుంది గదా " నేను జర్మనీతో సంధి గావించు కొన్నాను. నీవు రష్యా స్నేహం వదులుకోలేక పోతే నీకు నేను సహాయం చేయను." అని. ఇంతేగాదు దండెత్తిన జర్మనీపై ఇంగ్లండు కత్తి కట్టదు. బ్రిటిషు సహాయం వదలుకోవడమా, రష్యా సహాయం వదలుకోడమా అనేది ఫ్రాంసుకు ప్రశ్న? దానికి జవాబు ఫ్రాంసులో ఉండే ప్రభుత్వాన్ని బట్టి ఉంటుంది-ఇప్పటి ప్రభుత్వవైఖరిని బట్టి చూస్తే, రష్యాను వదలుకొనుటకే ఫ్రాంసు కోరు కొంటుంది. కాబట్టి ఫ్రాంకో-సోవియట్ సంధి ఆచరణలో భగ్నం అయింది అన్నమాట.

ఇక మధ్య యూరప్ సంగతి. జకోస్లోవేకియాలోని ముఖ్య పరిశ్రమలు, ఆయుధ ఫ్యాక్టరీలు హిట్లర్ వశమయినాయి.

ఇక జక్ ప్రభుత్వం ఆర్థిక దుస్థితికి లోనుగావలసి వస్తుంది. దాని కోసరం ఏ బిరిటనువద్దో అప్పు చేయక తప్పదు. ఈ అప్పులవల్ల పరాయి దేశాలపై జక్ ప్రభుత్వం ఆధారపడి వుంటమే గాక, నిర్వీర్యమైపోయింది. పూర్వం మధ్య యూరప్‌లోని చిన్న దేశాలన్నీ అటూ ఇటూ ఊగులాడుతున్నాయి. ఇపుడా ఊగులాట పోయి పూర్తిగా ఫాసిస్టు పక్షపాతం వహిస్తాయి. సూడెటన్ జర్మనీలో పొందిన ఆయుధ బలంతో,మధ్య యూరపు లోని చిన్న రాజ్యాల వారి మద్దతుతో రష్యాపై దండెత్తటానికి జర్మనీ తయారవుతుంది.

ఇదివరకు మేము చెప్పినట్లు (నవశక్తి 30-3-38) హిట్లర్ రష్యాపై దండెత్తడానికి మూడు మార్గాలున్నాయి.

1. జకోస్లోవేకియా, రుమేనియా మీదుగా ఒడెస్సా పట్టణం వద్దకు చేరి యుక్రైన్‌ను దెబ్బగొట్టడం.

2. తూర్పు ప్రష్యా, లిథూనియాల మీదుగ లెనిన్‌గ్రాడ్ మీద దెబ్బగొట్టడం, పోలండ్ మీదుగ మాస్కోపై దెబ్బగొట్టడం.

3. బాల్టిక్ సముద్రం ద్వారా లాట్వియా, ఇస్తోనియాల గుండా లెనిన్‌గ్రాడ్‌ను దెబ్బగొట్టడం.

ఇపుడీ మార్గాలన్నిటికీ సరియైన అవకాశం లభించింది. అయితే ఇక కావలసినది సమయమూ, సన్నాహమూ, ఇపుడు యుద్ధం తప్పింది గదా యని ఏ దేశమూ, యుద్ధ ప్రయత్నాలు మానదు. విరివిగా ప్రయత్నాలు చేస్తాయి. మిగిలి ఉన్న కాస్త సంబంధాన్ని కూడా త్రెంచుకోమని ఫ్రాంసును బలవంతపెట్టి, నాల్గు రాజ్యాల ఒడంబడిక ఒకటి గావించుకొని ఒక్కసారిగా రష్యాపై పడటమే తరువాయి.

పూర్వకథ

పార్వతీ దేవదాసులు చిన్ననాటనుండీ స్నేహంగా పెరిగారు. వారి ప్రేమను దేవదాసు తలిదండ్రుల తిరస్కారం విఘాతం తెచ్చింది. పార్వతి తండ్రి నీలకంఠ చక్రవర్తి, పార్వతిని, ఒక జమీందారునకిచ్చి పెండ్లి నిశ్చయించాడు. జమీందారు పేరు భువనచౌదరి. వయస్సు 40. రెండో పెండ్లి.

మొదట ఈ పెండ్లి వార్తవిని పార్వతి దుఃఖించింది. దేవదాసు వద్దకు పోయి తనను పెండ్లాడమని ప్రార్థించింది. కాని తలిదండ్రుల తిరస్కరించలేక దేవదాసు కలకత్తా చదువుకు వెళ్ళిపోయాడు. అక్కడ నుండి, పార్వతిని తనను మరచిపొమ్మని ఉత్తరం వ్రాశాడు. కాని మనసు మనసులో లేక ఇంటికి వెళ్ళాడు. పార్వతిని కలిసికొని, తాను తన తలిదండ్రుల ఒప్పించుతాననీ, తనను వివాహ మాడమనీ పార్వతి నడుగుతాడు. పార్వతి రోషంతో తిరస్కరించింది. దేవదాసు గాలం కర్రతో 'చంద్రునికి కళంకం' లాగా ఆమె ముఖానికి ఒక మచ్చ కల్పిస్తాడు. ఇద్దరూ కాసేపు దుఃఖిస్తారు. ఒకరి నొకరు ఓదార్చుకొని వెళ్ళిపోతారు.

పార్వతి వివాహం ఆట్టే అట్టహాసం లేకుండా జరిగిపోయింది.

ఇక దేవదాసు కలకత్తా లో.... తన దుఃఖాన్ని దిగమ్రింగడానికి ఒక వేశ్య యింటికి స్నేహితుడగు 'చున్ని'తో పోతాడు. కాని చంద్రముఖి—వేశ్య—ను చూడగానే అసహ్యించుకొని, ఒక నోటు దాని చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు. చంద్రముఖీ, "చున్నీ" ఆశ్చర్యపోయారు. చంద్రముఖి—వేశ్యయే అయినా—దేవదాసును ప్రేమించింది.

పార్వతి అత్తవారింటికి పోయింది. తన ధన సంపదల కాశ్చర్యపడింది. ఒక్కసారి గృహిణి అయి కూర్చున్నది. పెద్ద కుమారుడు మహేంద్రుడు బి. ఏ. ప్యాసయాడు. రెండోవాడు కలకత్తాలో చదువుతున్నాడు. కూతురు యశోద అలిగి ఇంటికి రాలేదు. ఈ విషయాలన్నీ, నమస్కరించ వచ్చిన మహేంద్రుని వలన పార్వతి తెలుసుకున్నది.

ఇక భువనచౌదరి—పార్వతి భర్త—పూజా పునస్కారాలు ముగించుకొని, ఏ అర్ధరాత్రికో అంతఃపురానికి వచ్చేవాడు. ఒక రోజున తన బిడ్డల సంగతి అంతా చెపుతూ యశోదను పొగడి, తనను తప్పకుండా చూడడానికి వస్తుందని తెల్పుతాడు.

ఆ తరువాత

పార్వతి భర్త దగ్గరకు వచ్చి అతని బట్టతలమీద మెత్తని చెయి వేసి—'మీరా సంగతి ఆలోచించ నక్కర లేదు. నేను యశోదను తీసుకురావటానికి మనిషిని పంపుతాను. లేకపోతే మహేంద్రుడే పోతాడు' అనేది.

'పోతాడా? సరే! నేను చాలా రోజుల నుంచి చూడలేదు—మనిషిని పంపుతావా?'

'ఎందుకు పంపను ? నా అమ్మాయిని తీసుకురావటం నాకు తెలియదా?'

వృద్ధుడు ఉత్సాహంతో లేచి కూర్చుని, ఇద్దరికీ ఉన్న సంబంధం కూడా మరిచిపోయి, పార్వతి తలను స్పృశించి ఆశీర్వదించే వాడు:—'నీకు శుభం కలుగు తుంది. నువ్వు సుఖ పడతావు. భగవంతుడు నీకు ....' తర్వాత ఆవృద్ధునికి ఏవేవో సంగతులు జ్ఞాపకం వచ్చేవి. మళ్ళీ పక్కమీద పండుకుని, కళ్ళు మూసుకుని—"ఒక్కగాని ఒక్కఅమ్మాయి—నన్ను ఎంత ప్రేమించేది!' అనిమనస్సులో అనుకునేవాడు.

ఈ సమయంలో అతని నెరసిన మీసాల పక్కగా అశ్రుబిందువులు జారి బాలీసు మీద పడేవి. పార్వతి తుడిచేది. అతను మెల్లగా గొణుక్కునేవాడు—"ఆహా, మళ్ళీ అందరూ వస్తారు. ఇంకోమాటు ఇల్లూ వాకిలీ కళ కళ లాడుతుంది—ఒక్కమాటుగా వెలిగిపోతుంది. పూర్వం సంసారం ఎంత బాగుండేది! కొడుకులూ, కూతురూ, భార్యా—కిరణాలగా ఉండేది; పండగగా ఉండేది. తర్వాత ఒకనాడు అంతా చల్లారిపోయింది. కొడుకులు కలకత్తా వెళ్ళారు, యశోద అత్తవారింటికి పోయింది—మళ్ళీ అంధకారమూ, శ్మశానమూ—"

ఈ సమయంలో అతని మీసాలు రెండూ తడిసి బాలీసుకూడా తడిసేది. పార్వతి ఆకులపాటుతో తుడిచి—"మహేనుకు పెళ్ళెందుకు చేయలేదు ?" అని అడిగేది.

వృద్ధుడు అనేవాడు—"అలా అయితే నాకు మంచిరోజులు వచ్చేవే! నేను కూడా చేద్దామనే అనుకున్నాను. కాని వాడి మనస్సులో ఏమున్నదో ఎవరికి తెలుసు! వాడు పట్టుపట్టి వివాహం చేసుకో లేదు. అందుకనే ఈ ముసలితనంలో—ఇల్లంతా బావురుమంటూ ఉంటే— దరిద్రుని కొంప మాదిరి బోసికొట్టుతూ ఉంటే—లక్ష్మి వదలిపెట్టి పోయినట్టుగా ఉంటే—ఇంట్లో ఎక్కడా వెలుగు అనేది కనపడకపోతే—ఈ—'

ఈ మాటలు వింటే పార్వతికి చాలా దుఃఖం వచ్చేది. ఆమె లేచి నవ్వు తెచ్చుకుని, కరుణా స్వరంతో—"మీరు ముసలివారైతే, నేనూ త్వరగా ముసలిదాన్ని అవుతాను. ఆడవాళ్ళ ముసలివారు కావటానికి ఎంత కాలం పడుతుంది?' అనేది.

భువన చౌదరి లేచి కూర్చుని, చేత్తో ఆమె గడ్డం పట్టుకుని ముఖం వంక చాలాసేపు చూస్తూ ఉండి పోయే వాడు. శిల్పి ప్రతిమను అలంకరించి, తల మీద కిరీటం పెట్టి, అటూ ఇటూ వంగి, చాలా సేపు ఎలా చూస్తూ ఉంటాడో; కొంచెం గర్వమూ, చాలా స్నేహమూ అతని ముఖంలో ఎలా కూడుకుంటుందో—అలానే భువన బాబు ముఖంలోనూ కూడుకునేవి. ఎప్పుడన్నా అతని నోట నుంచి అస్ఫుటంగా—'అయ్యో! నేను మంచి పని చేయలేదు!' అని వెలువడేది.

"ఏమిటండీ, మంచిది కానిది?"

"ఈ యింట్లో నీవు శోభించవని అనుకుంటున్నా—"

"బాగానే శోభిస్తాను. మా కింకా శోభించడం, శోభించక పోవడం ఏముంది?" అనేది నవ్వుతూ.

వృద్ధుడు మళ్ళీ పండుకుని మనస్సులో అనుకునేవాడు : "ఆఁ! ఆ సంగతి నాకు తెలుసును—తెలుసును! తప్పక నీకు మేలు కలుగుతుంది. భగవంతుడు నిన్ను కనిపెట్టి ఉంటాడు!"

* * *

ఈవిధంగా ఒక మాసం గడిచింది. ఈమధ్య ఒక మాటు చక్రవర్తి కుమార్తెను తీసుకుపోవటానికి వచ్చాడు. కాని పార్వతి పోవటానికి ఇష్టపడలేదు—"దారీ తెన్నూ లేని సంసారం నాన్నా! ఇంకా కొన్నాళ్లుండి వస్తాను" అన్నది తండ్రితో. తండ్రి ముఖం చాటు చేసుకొని నవ్వుకుని—"స్త్రీ జాతే యిటువంటి"దని మనస్సులో అనుకున్నాడు.

తండ్రి వెళ్ళిపోయిన తర్వాత పార్వతి మహేంద్రుని పిలిచి—"నాయనా! ఒకమాటు మన అమ్మాయిని తీసుకు రా!" అన్నది.

మహేంద్రుడు తప్పించుకోవాలని చూశాడు. యశోద ఎంత మాత్రం రాదని అతనికి తెలుసు—"నాన్న పోతే బాగుంటుం దనుకుంటాను" అని సంకోచిస్తూ అన్నాడు.

"ఛీ, అది బాగా ఉంటుందా? అంతకంటె మనిద్దరం పోయి అమ్మాయిని తీసుకు వద్దాం."

"మీరు వస్తారా?" అన్నాడు మహేంద్రుడు ఆశ్చర్యంతో.

"తప్పేముంది నాయనా? సిగ్గుపడవలసిన విషయం అందులో నా కేమీ కనపడటం లేదు. నేను వెళ్ళినందువల్ల యశోద వస్తే, దాని కోపం తగ్గిపోతే—రావటం నా కేమంత కష్టం!"

మర్నాడు మహేంద్రుడు ఒంటరిగానే యశోదను తీసుకురావటానికి పోయాడు. అక్కడ ఏమి కౌశలం చూపించాడో తెలియదు కాని నాలుగోనాడు యశోదను వెంటపెట్టుకుని వచ్చాడు.

ఆరోజున పార్వతి వొంటిమీద కొత్తవీ, చిత్రమైనవీ, విలువగలవీ, చాలా నగలున్నవి. కొన్ని ఆనాడే భువనబాబు కలకత్తా నుంచి తెచ్చియిచ్చాడు. పార్వతి అవి పెట్టుకుని కూర్చున్నది. దోవలో వచ్చేటప్పుడు, యశోద కోపంతోనూ, అభిమానంతోనూ అనేక మాటలు వల్లించుకుంటూ వచ్చింది. కాని, పినతల్లిని చూడగానే ఆమె స్తంభీభూతురాలైంది. ఆమె అనాలని, ద్వేషంతో వల్లించుకుంటూ వచ్చిన మాటలన్నీ మరచిపోయి అస్ఫుటంగా— "ఈమేనా!" అని అన్నది.

పార్వతి, యశోదను చేయి పట్టుకొని ఇంట్లోకి తీసుకుపోయింది. దగ్గర కూర్చోపెట్టుకుని విసనకర్రతో విసరుతూ— "ఏం తల్లీ! అమ్మమీద కోపమా?" అని అడిగింది.

యశోద ముఖం సిగ్గుతో కందిపోయింది. పార్వతి అప్పుడు తన వొంటిమీద నగలను ఒక్కొక్కటే తీసి యశోదను అలంకరింప నారంభించింది. యశోద విస్మయంతో "ఇదేమిటి?" అని అన్నది.

"ఏమీలేదు. ఇది మీ అమ్మ అభిలాష!"

దేవదాసు

శరత్ బాబు

విరచితం

నగలు పెట్టుకోవటం యశోదకు ఇష్టం లేకపోలేదు. అలంకారం పూర్తి అయినాక ఆమె పెదవుల మీద చిరునవ్వు కూడా కనిపించింది. యశోదను అలంకరించి నిరాభరణమైన పార్వతి— "అమ్మమీద కోపమా తల్లీ?" అని అడిగింది.

"ఉహుఁ. కోపమెందుకు? — కోపమేముంది?"

"అంతేకాక ఏముంది తల్లీ! ఇది మీ తండ్రిగారి యిల్లు, పెద్ద యిల్లు—ఎంతోమంది దాసదాసీలు కావలసి ఉంటారు. నేనూ ఒక దాసీనేగా. ఛీ, దాసదాసీలమీద అలగటం బాగా ఉంటుందా తల్లీ!"

యశోద ఏళ్ళకు పెద్దదయినా మాటల్లో ఇంకా చాలా చిన్నది. ఆమె కలవరపడింది. పార్వతి విసనకర్రతో విసరుతూ అన్నది.

"దరిద్రుల బిడ్డను. మీదయవల్ల ఇక్కడ కొంచెం చోటు చిక్కింది. ఎంతమంది దీనులూ, అనాధులూ మిమ్మల్ని ఆశ్రయించి బ్రతకటం లేదు ? —నేను కూడా వారిలో ఒకతెను. ఆశ్రితులను—"

యశోద మంత్ర ముగ్ధ వలె వింటూ ఉన్నది. ఇప్పు డామె ఒక్కమాటుగా ఆత్మ విస్మృతి చెంది, పార్వతి కాళ్ళ మీద పడి నమస్కరిస్తూ—"నీ కాళ్ళు పట్టుకుంటానమ్మా—" అన్నది.

పార్వతి ఆమె రెండు చేతులూ పట్టుకున్నది.

"నా తప్పు లన్నీ ఎంచకోకు తల్లీ!" అన్నది.

మరునాడు మహేంద్రుడు యశోదను చాటుకు పిలిచి—"ఏం, కోపం ఏమన్నా తగ్గిందా?" అని అడిగాడు.

యశోద చప్పున అన్న కాళ్ళు పుచ్చుకుని— "అన్నా! కోపంలో —ఛీ,ఛీ—ఏమేమో వాగాను. చూడు, అవెక్కడా వెల్లడించకు!"అన్నది.

మహేంద్రుడు నవ్వ నారంభించాడు.

"చక్రపాణి"

అనువాదం

"మారు తల్లి ఎక్కడన్నా ఇంత ప్రేమ చూపిస్తుందా, అన్నాయి!" అని యశోద అడిగింది.

రెండు దినాలు గడచినాక యశోద తండ్రి దగ్గరికి పోయి—"ఇంకా రెండు మూడు మాసాలదాకా రానని వారికి ఉత్తరం రాయి నాన్నా!" అన్నది.

"ఎందుకు తల్లీ?" అన్నాడు భువనబాబు ఆశ్చర్యంతో.

యశోద సిగ్గుపడుతూ, మందహాసం చేసి—"నా వొంట్లో అంత బాగా లేదు. కొన్నాళ్లు పిన్ని దగ్గర ఉంటాను" అన్నది.

ఆనందంతో వృద్ధుని కళ్ళ వెంట జల జల నీరు కారింది. సాయంత్రం పార్వతిని పిలిచి—"నువ్వు నా పరువు నిలిపావు! నూరేళ్ల బ్రతుకు —నూరేళ్ళు బ్రతుకు!" అన్నాడు.

"అదేమిటండీ—?" అన్నది పార్వతి.

"అదేమిటో నే నిప్పుడు సరిగా చెప్పలేను—భగవంతుడా! ఇప్పుడు నువ్వు నన్నెంత అవమానం నుంచీ, మనోదుఃఖం నుంచీ తప్పించావు!"

ఆ సందె చీకటిలో భర్త కళ్ళలో నీరు నిండటం పార్వతికి కనపించ లేదు. ఇక వినోదలాల్ భువనబాబు చిన్న కొడుకు మిగిలాడు. వాడు పరీక్షకు కూర్చుని వచ్చినాక మరల చదవటానికి పోలేదు.

౧౧

చంద్రముఖి ఇంటనుంచి తిరిగివచ్చినాక దేవదాసు, పిచ్చివానిలాగా రోడ్లవెంట తిరిగాడు! ఒకనాడు ధర్మదాసు ఏమో చెప్పబోతే, వాడిని గుడ్లురుమి బెదరించాడు. దేవదాసు ధోరణి చూసేవరకు చున్నీలాలు గూడా ఏమీ చెప్పటానికీ ధైర్యం లేకపోయింది. ధర్మదాసు ఏడుస్తూ "చున్నీబాబూ! ఎందుకు వీరిలా మారిపోయారు?" అని చున్నీని అడిగాడు.

"అదే, ధర్మదాస్! ఏమి జరిగిందేమిటో?" అని చున్నీ మరల ప్రశ్నించాడు,

ఒక అంధుడు ఇంకో అంధుణ్ణి దోవ చూపించమని అడిగాడు! అసలు సంగతేమిటో వీరిద్దరికీ తెలియదు. ధర్మదాసు కళ్ళు తుడుచుకుంటూ— "చున్నీబాబూ! ఏలాగైనసరే, దేవదాసును ఒకమాటు వాళ్ళ తల్లి దగ్గరికి పంపించు. ఇక చదవ దలచనప్పుడు ఇక్కడ ఉండి ఏమి చేస్తాడు?" అన్నాడు.

"ఆమాట నిజమే." చున్నీలాలు ఆసంగతి ఆలోచింప నారంభించాడు.

నాలుగైదు రోజులు గడిచాక ఒకనాడు చున్నీబాబు సాయంకాలం బయటకు పోతూ ఉండగా దేవదాసు ఎక్కడనుంచో వచ్చి అతని చేయి పట్టుకొని— "అక్కడకే పోతున్నావా, చున్నీబాబూ?" అని అడిగాడు,

చున్నీలాలు సగం చచ్చి— "ఆఁ. ఇక వద్దంటే పోను." అన్నాడు.

"ఉహుఁ, నేను వద్దనను. కాని నాకొక సంగతి చెప్పు — నువ్వు ఏ అపేక్షతో అక్కడికి పోతున్నావు?"

"వేరే ఆపేక్షేముంది, కాలం గడపటానికే."

"గడుస్తుందా? ఏదీ, నాకు గడవటంలేదే; నేను కూడా కాలం గడపాలను కుంటున్నాను!"

చున్నీలాలు కాసేపు అతని ముఖం వంక చూస్తూ ఉండి పోయాడు —అతని మనస్సులో సంగతులు ముఖాన్ని బట్టి తెలుసుకోవాలన్నట్టుగా! తర్వాత—"దేవదాస్! అసలు వ్యవహార మేమిటో కాస్త చెప్పుతావా?" అని అడిగాడు.

"ఏమీ లేదు."

"చెప్పవా?"

"కాదు చున్నీ, చెప్పటాని కేమీ లేదు."

చున్నీ చాలాసేపు నేలవంక చూసి—"దేవదాస్! నా మాట ఒకటి నిలుపుతావా?" అని అడిగాడు.

"ఏమిటి?"

"అక్కడికి ఇంకోమాటు రావాలి. నేను మాట ఇచ్చాను."

"ఆవాళ మనం వెళ్ళినచోటుకే కదూ?"

"ఆఁ—"

"ఛీ, నాకు బాగుండదు."

"నీకు బాగా ఉండేటట్టు నేను చేస్తానులే."

దేవదాసు కొంచెంసేపు అన్య మనస్కుని వలె మాట్లాడకుండా ఉండి—"సరే, వెళ్ళుదాము, పద!" అన్నాడు.

* * *

దేవదాసును అధోగతిలోకి ఒక మెట్టు క్రిందకు దించి చున్నీలాలు ఎటో తప్పుకు పోయాడు. దేవదాసు ఒక్కడే చంద్రముఖి గదిలో క్రింద కూర్చుని మద్యం త్రాగుతున్నాడు. చంద్రముఖి అతని దగ్గరనే కూర్చుని, విచారంతో అతని ముఖం వంక చూస్తూ—"దేవదాస్, ఇక త్రాగబోకు" అని అన్నది భయపడుతూ.

దేవదాసు గ్లాసు క్రింద పెట్టి ముఖం చిట్లించుకుని—"ఎందుకు ?" అన్నాడు.

"మద్యం అలవాటు చేసుకుని కొద్ది రోజులే అయింది. ఇంత ఎక్కువ భరాయించలేవు."

"భరాయించటం కోసం నేను మద్యం త్రాగటం లేదు. ఇక్కడ ఉండటానికే నేను త్రాగుతున్నాను."

ఈ మాట చంద్రముఖి అనేకసార్లు విని ఉన్నది. ఒక్కొక్కప్పుడు తల గోడకు వేసి పగలగొట్టుకుని చద్దామని కూడా అనుకున్నది— దేవదాసును ఆమె ప్రేమించింది.

దేవదాసు మద్యం గ్లాసు విసిరివేశాడు. అది పోయి సోఫా కోటికి కొట్టుకుని చూర్ణమై పోయింది. తర్వాత దేవదాసు బాలీసు లాక్కొని పండుకుని తొట్రుపడుతున్న స్వరంతో చెప్ప నారంభించాడు: — "నాకు లేచి పోయే సత్తువ లేదు. అందుకనే ఇక్కడ కూర్చున్నాను. నాకు స్మృతి ఉండటం లేదు—అందుకనే నీ ముఖంవంక చూసి మాట్లాడగలుగుతున్నాను. చం—ద—రా—ఇంకా నాకు పూర్తిగా తెలివి పోలేదు, కాస్త ఉన్నది—నిన్నంటుకో లేను. నీవంటే నాకు చాలా అసహ్యం."

చంద్రముఖి కళ్ళు తుడుచుకొని, మెల్లగా—"దేవదాస్! ఇక్కడికి ఎంతోమంది వస్తారు. కాని వాళ్లెవరూ మద్యం అంటుకోరు" అన్నది.

దేవదాసు కళ్లు విప్పుకుని లేచి కూర్చుని తడబడుతూ, చేతులు అటూ ఇటూ తిప్పుతూ—"అంటుకోరా? నా దగ్గర తుపాకి ఉంటే వాళ్ళని కాల్చివేసే వాణ్ణి. వాళ్ళు నాకంటే కూడా పాపిష్టులు చంద్రముఖీ." కొంచెం సేపాగి మరల "ఎప్పుడైనా తాగుడు వదలి పెట్టితే—అసలు వదలిపెట్టనులే—మళ్ళీ నేను నీదగ్గరికి రాను. నాకు ఈ మాత్రమైనా దోవ కనపడుతున్నది—కాని వారి కేదీ?" అన్నాడు.

కాసేపు ఆగి మద్యాన్ని సంబోధించి చెప్ప నారంభించాడు.

"ఓ నా ఆపద్బంధువా! నేను చాలా కష్టంలో ఉండి నిన్ను అలవాటు చేసుకున్నాను, నిన్ను నేను వదలిపెట్టను. వదలిపెట్టలేను."

దేవదాసు బాలీసు మీద ముఖం రుద్ద నారంభించాడు— చంద్రముఖి తొందరగా అతని దగ్గరికి వచ్చి ముఖం పైకి ఎత్తింది. దేవదాసు ముఖం చిట్లించుకుని అన్నాడు :

"ఛీ, నన్ను అంటుకోబోకు. ఇంకా నాకు తెలివి ఉన్నది. చంద్రముఖీ! నీకు బాగా తెలియదు—నాకు తెలుసును, నిన్ను నేను ఎంత అసహ్యించు కుంటున్నదీ. నిన్ను ఎప్పుడూ ఏవగిస్తాను. అయినా నీదగ్గరికి వస్తాను, కూర్చుంటాను, మాట్లాడతాను, లేకపోతే నాకు గత్యంతరం లేదు! ఈ సంగతి నీకు అర్థమవుతుందా? హ్హా, హ్హా, హ్హా— ఎవ్వరైనా, పాపం చీకట్లో తప్ప చేయరు, నేను ఇక్కడికి వచ్చి తాగుబోతు నవుతున్నాను,— ఇంతకంటే మంచి చోటు ఈ ప్రపంచకంలో ఇంకెక్కడ ఉన్నది. ఇక మీరంతా—"

దేదదాసు దృష్టిని కేంద్రీకరించి కాసేపు చంద్రముఖి విచారముఖం వంక చూచి— "ఆహా! సహనశక్తి నీలో ఉట్టి పడుతూంది. స్త్రీలు ఎంత అవమానమూ, తిరస్కారమూ, ఎన్ని అత్యాచారాలూ, ఉపద్రవాలూ సహింపగలరో నువ్వే దానికి తార్కాణము!"

తర్వాత వెల్లికిల పండుకొని మెల్లగా అనుకోసాగాడు:

చంద్రముఖంట, నన్ను ప్రేమిస్తున్నదంట. — నాకక్కర్లేదా ప్రేమ—అక్కర్లేదు—లేదంటేలేదు. నాటకాలు ఆడేవాళ్ళను చూశాముగా, ముఖానికి సుద్దా మసీ పూసుకొని, దొంగలవుతారు—బిచ్చమెత్తుతారు—రాజులవుతారు—రాణీలవుతారు—ప్రేమిస్తారు—ఎన్నో ప్రేమ సంగతులు చెప్పుతారు—ఎంతో ఏడుస్తారు—అంతా నిజమయినట్టుగా! అలాగే చంద్రముఖీ కూడా నాదగ్గర నాటకం ఆడుతున్నది, నేను చూస్తున్నాను.... కాని నాకు దాని సంగతే జ్ఞాపకం వస్తూ ఉంటుంది. ఒక్క క్షణంలో అంతా అయిపోయింది. అది ఎటు వెళ్ళిపోయింది, నేను ఎటు వచ్చేశాను! ఇక నా జీవితానికంతకూ మంచి అభినయం ఆరంభమైంది, ఒకరు పక్కా తాగుబోతు ఇంకొకతె—సరే, అదేకానీయి—అదేకానీయి—పోయేదేముంది! ఆశలేదు, భరవాసా లేదు, సుఖంలేదు, కోరికలేదు. వహ్వా! అదేకానీయి!"

తర్వాత దేవదాసు ప్రక్కకు పొర్లి ఏమేమో గొణగ నారంభించాడు. చంద్రముఖికి ఏమీ అర్థంకాలేదు. కాసేపట్లో దేవదాసు నిద్రపోయాడు—అప్పుడు చంద్రముఖి దగ్గరకు వచ్చి కూర్చున్నది, కొంగుతడిపి ముఖమంతా తుడిచి, తడిసిన దిండు మార్చింది. విసనకర్ర తీసుకొని కాసేపు విసిరి, చాలాసేపు తలవంచుకు కూర్చున్నది, రాత్రి ఒంటిగంట అయాక దీపం పెద్దదిచేసి, తలుపు దగ్గరకు లాగి ఇంకో గదిలోకి వెళ్ళిపోయింది.

రన్సిమన్ జక్‌కు తలపెట్టిన ద్రోహం

శ్వేత పత్రంలో రన్సిమన్ తెల్పిన విషయాలు

జెకోస్లోవేకియా సమస్యను గురించి రన్సిమన్ ప్రభువుకు బ్రిటిషు ప్రధాన మంత్రి ఛేంబర్లేనుకుకు ఉత్తర ప్రత్యుత్తరములు వగైరా శ్వేతపత్రం మూలంగా బ్రిటిషుప్రభుత్వం వారి చేత నేడు ప్రకటించబడినవి. అవి ఇవి.

సెప్టెంబరు 21 వ తేదీ రన్సిమను ప్రభువు ఛేంబర్లేనుకు వ్రాసిన ఉత్తరంలో (రన్సిమను) అగస్టు మాసారంభములో జెకోస్లోవేకియాకు వెళ్ళినప్పుడు సూడెటను జర్మనులకు స్వయం నిర్ణయ సూత్రం విషయమై ఎవ్వరు తీవ్రంగా అనుకోటం లేదనిన్నీ కొంతమట్టుకు హోం రూలు (స్వపరిపాలన) ఇవ్వబడే సూచనలు జెకోస్లోవేకియా రాజ్యాంగ పరిస్థితులలోనే యిమిడివున్నవనీ వ్రాసెను.

సూడెటను జర్మను పక్షం కోరిన 8 షరతులనుబట్టి ఈ సమస్యా పరిష్కారం జరగడం అసంభవమని తేలింది. అందుచేత అగస్టు 17 వ తేదీన రాయబారాలు ఆగిపోయినవి.

జెకోస్లోవేకియా ప్రభుత్వం వారితో ఇంకా కొంత చర్చ జరిపినమీదట వారు నాల్గవ ప్రణాళిక నొకదానిని సిద్ధముచేసి, సెప్టెంబరు 5 వ తేదిని రన్సిమను ప్రభువుకు, 6 వ తేదీని సూడెటనుల కందజేసిరి. సూడెటను జర్మనులు కోరిన ఎనిమిది షరతులను దాదాపు ఈ ప్రణాళికలో ఆమోదింప బద్ధులైనని రన్సిమను ప్రభువుగా రభిప్రాయపడిరి. సూడెటను నాయకులలో బాధ్యతకల వారి అభిప్రాయము కూడ ఇదే ఐనట్లు రన్సిమనుగారు నమ్మిరి. ఈ "నాల్గవ ప్రణాళిక"ను ఆధారంగా జేసుకొని వెంటనే మళ్ళీ రాయబారాలు జరగవలసినదే. కాని, జెక్కు ప్రభుత్వం వారింతవరకు తగ్గి రావటంచేతనే సూడెటనులు మరింత బిర్ర బిగిసిరని రన్సిమను ప్రభువుగా రభిప్రాయ పడిరి. ఆ సమయంలో ఏవో కొన్ని "సంఘర్షణలు" తటస్థించినవి. ఆ నెపంమీద రాయబారాలు ఆపు చేయబడినవి. ఐనప్పటికి జెక్కు ప్రభుత్వం వారు మాత్రము వెంటనే సూడెటనుల షరతు లామోదించారు. అందుపై సెప్టెంబరు 10 వ తేది మళ్ళీ సంప్రతింపులు ప్రారంభమయినవి. కాని సూడెటనులలో అతివాదులకు ఈ సంప్రదింపులు మరల ప్రారంభమవటం రుచించలేదు. సెప్టెంబరు 11వ తేదీనమళ్లీకొన్ని ఘర్షణలు సంభవించినవి. హిట్లరు ఉపన్యాసం జరిగిన తరువాత మరీ ఎక్కువగా చెలరేగినవి, ఆ విధంగా కొందరు చావటం రక్తపాతం కావటం దీన్ని ఆధారం చేసుకొని సూడెటనులు జెక్కు ప్రభుత్వం వారితో సంధి నిరాకరించి కొత్త షరతులు కోరటం మొదలు పెట్టారు. జెక్కు ప్రభుత్వమును, తన పోలీసు దళాన్ని సూడెటన్ను ప్రాంతంలో నుండి తొలగించ వలసిందిగ కోరిరి. సూడెటన్ ప్రాంతంలో శాంతి భద్రతల సంరక్షణ విధానాన్ని గూర్చి సూడెటను ప్రతినిధులు ప్రేగు పట్టణానికి వచ్చి జెక్కు ప్రభుత్వం వారితో చర్చించినచో పోలీసు దళాలను తీసివేసెదమని జెక్కు ప్రభుత్వంవారు సమాధానం పంపిరి. సెప్టెంబరు 13 వ తేదీని హిట్లరు ఇందుకు అంగీకరించ లేదు. అందుచేత రాయబారాలు విఫలమయినవి" అని రన్సిమన్ గారనిరి.

రన్సిమన్ గారి ప్రయత్నం ముగిసింది

అప్పటినుంచి సూడెటన్ నాయకులకు,జర్మనీకి గల సంబంధం ముఖ్య సమస్యగా ఏర్పడింది. రన్సిమన్ ప్రభువు గారు పూనుకున్నది జెకోస్లోవేకియా దేశంలో అంతఃకలహం జరక్కుండా సంధి జరపటానికే గాని జర్మనీ జెకోస్లోవేకియా రెండు దేశాల మధ్య వ్యవహారం పైసలు చేయటానికి కాదు. కాబట్టి అంతటితో రన్సిమన్ ప్రభువు చేసిన ప్రయత్నం యావత్తు విఫలమైపోయింది. ఈవిధంగా రాజీప్రయత్నం విచ్ఛిన్నం కావటానికి హెన్లినున్నూ అతణ్ణి తీవ్ర చర్యకు పురికొల్పిన వ్యక్తులూ బాధ్యులని రన్సిమన్ ప్రభువు గారి అభిప్రాయము. సూడెటనుల విషయంలో రన్సిమన్‌గారికి సానుభూతి లేకపోలేదు. జక్ ప్రభుత్వంవారు సూడెటనులను అధికారం చేత లోబరచుకోటానికి గాని, వారి హక్కులను తృణీకరించి కాల రాయటానికి గాని ఉద్యమించారనటం సర్వాబద్ధం. కాని జక్ ప్రభుత్వంవారు కొంచెం యుక్తితోను,



రన్సిమన్ ప్రభువు

సమయానుకూలంగా ప్రవర్తించినట్టుంటే సూడెటను లింతగా తిరగబడే స్థితికి వచ్చేవారు కారని రన్సిమన్‌గా రంటున్నారు. జక్ ప్రభుత్వంవారిదివరలో అనేకంగా వాగ్దానాలు చేశారు. కాని వాటిని అమలు జరపటానికి చింతాకంతయినా ప్రయత్నించలేదని సూడెటను లంటారు. దీని వల్ల జక్ ప్రభుత్వంవా రెంత సమాధానానికి రావటానికి ప్రయత్నించినా సూడెటనులు వారి మాటలను విశ్వసించలేదు. జక్ పార్లమెంటుకు 1935 సం॥లో జరిగిన ఎన్నికల్లో, మొత్తం 300 మంది సభ్యులలో సూడెటనులు 44 మంది వున్నారు. ఆ పార్లమెంటులో బలమైన రెండవ పక్షం వీరిదే; ఐనప్పటికీ వారి పక్షం ఎన్నడూ నెగ్గేది కాదు. అందుచేత చట్ట సంబంధమైన చర్యలు నిష్ప్రయోజనమని సూడెటనులు కొందరి తలంపు.

సూడెటనుల ఆరోపణలు.

సూడెటనులు అని రన్సిమన్‌గారి అభిప్రాయములో కావించిన ఈక్రింది ఆరోపణలు న్యాయమైనవి. జర్మనీభాష బాగా రాని జెక్కు ఉద్యోగులు విశేషంగా జర్మనీ జిల్లాలలో నియమింపబడ్డారు. ప్రభుత్వ కంట్రాక్టులిచ్చే విషయంలోను, ప్రభుత్వసహాయం పొందే విషయములోను జెక్కుల వ్యాపారసంస్థలు అభిమానింపబడ్డవి. గృహచ్ఛిద్రములే యైనప్పటికిన్నీ, ఈ సంతృప్తిని నివారణచేయడానికి తగిన ప్రయత్నాలు చేయబడలేదు.

ఆర్థిక క్లిష్టపరిస్థితి ఏర్పడేసరికి ఈ చిన్న చిన్న కొరతలే గోరంతలు కొండతలయినవి. అందుచేత, హిట్లర్ అధికారం వహించేటంత వరకు సూడెటనులు నిరాశతో వుంటూ వచ్చారు సూడెటనులు రీచిలో చేరిపోదామని కోరటం వారి పరిస్థితులను బట్టి సహజమైన కోరికయేనని రన్సిమను అభిప్రాయం. ఏదో విధంగా సూడెటనులు హక్కులు కొంత వరకు అంగీకరించటం తప్పనిసరి కాబట్టి ఆ ఇవ్వదలచుకొన్న వేవో వెంటనే యిచ్చేయటం మంచిదనీ, అటూ యిటూ తేల్చకుండా నాన్చటంవల్ల అంత ర్యుద్ధం సంభవించ వచ్చునని రన్సిమన్ ప్రభువు గారి వుద్దేశం. జర్మనులు అధికంగా వుండే ప్రాంతాలలో జనాభిప్రాయం తెలుసుకోవటం కేవలం లాంఛన పూర్వకమైనా, ఆలస్యంవల్ల ప్రమాదం కలుగుచుందని రన్సిమనుగారు శంకించారు. అందుచేత సరిహద్దులలో వుండే జిల్లాలు వెంటనే జర్మనీ దేశానికి యిచ్చివేయబడాలి. జర్మను మెజారిటీ అంత అధికంగా లేని ప్రదేశాలలో "నాల్గవ ప్రణాళిక" ననుసరించి జకోస్లోవేకియాలోనే స్థానిక స్వపరిపాలనం స్థాపింపబడవలెనని రన్సిమన్‌గారు అన్నారు.

జెక్కుల స్వాతంత్ర్య రక్షణ.

జెకోస్లోవేకియా స్థాయి దశ కనూ, ఐరోపా ఖండంయొక్క శాంతికిన్నీ స్విజరు లేండు మోస్తరుగానే అంతర్జాతీయ విధానం ఏర్పరచుట అవసరమని రన్సిమన్‌గారి అభిప్రాయం.

అందు కొరకు రన్సిమన్ ప్రభువుగారు చేసిన శిఫార్సు లివి:—(1) జెకోస్లోవేకియా ఇరుగు పొరుగు దేశాల వారికి ప్రాతికూల్యాన్ని పురికొల్పుతూ ఉండే వారి యొక్క ఆందోళనను అరికట్టటానికై అవసరమైతే, జకోస్లోవేకియావారు చట్ట సంబంధమైన చర్యలు గైకొనవలెను. (2) ఇతర రాజ్యాలవారితో జెకోస్లోవేకియా చేసుకున్న ఒడంబడికల కారణంచేత తన ఇరుగు పొరుగు దేశాల వారిపైన దాడి వెడలకుండా ఉండేటట్టు జెకోస్లోవేకియా విదేశములతో తనకు గల సంబంధాన్ని పునర్నిర్మాణం చేసుకోవాలి. (3) అనవసరంగా జకోస్లోవేకియాపైకి ఎవరు దండెత్తి రాకుండా (ఇంగ్లండు, ఫ్రాన్సు, జర్మనీ మొదలయిన) పెద్ద రాజ్యాలవారు హామీ యివ్వాలి. (4) జర్మనీవారికి జెక్కు ప్రభుత్వంవారికి వ్యాపార సంబంధమైన ఒడంబడికకు రాయబారాలు జరపాలి. జకోస్లోవేకియా మంత్రి వర్గములో సూడెటన్ జర్మను ప్రతినిధి ఒక్కనికి స్థానం వుండాలి. ఉభయ పక్షాలకు చెందని అధ్యక్షునితో, ఏయే భాగాలు ఎవరెవరికి చెందవలెనో నిర్ణయించే కమిషను ఒకటి ఏర్పాటుకావాలి. ఆ విధంగా సరిహద్దులు నిర్ణయ మయ్యేంత వరకు అంతర్జాతీయ సైన్యాలు శాంతి, భద్రతలను కాపాడాలి" అని రన్సిమన్ ప్రభువుగారు శిఫార్సు చేశారు.

మహాత్ముని తత్వం

(3 వ పేజీ తరువాయి)

పద్ధతులపై" అని ప్రయోగించుటకు అంగీకరించిన మహాత్ముడు ఈ నాడు, ఆ ఓడింపబడిన "సత్యా హింసలు" అనే దాని కొరకే ఇంత పట్టు పట్టుటను చూస్తే గాంధీగారి తత్వబోధ, ఉద్యమాభి వృద్ధిని ఎంత వరకు వెనక్కిలాక్కొని రావీలవుతుందో అంత వెనక్కి తీసుకొనిపోవు చున్నది.

భారత దేశంలో సంపూర్ణ స్వాతంత్ర్య పోరాటం దశలు మారుతూ వచ్చింది. కాంగ్రెసు వారు 7 రాష్ట్రాలలో మంత్రులయారు. మూల మూలల నున్న ప్రజా సామాన్యం మేల్కొన్నారు. సంస్థానాలలో ప్రజలు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, చిన్న ఉద్యోగులు, గుమాస్తాలు-నౌకర్లు - ఒకరేమిటి-బాధ పడుతూన్న ప్రతివాడూ, తన బాధను పోగొట్టుకోవాలనే దీక్షతో లేచాడు. ఆయా సమస్యల నివారణకై పని చేస్తూన్న ప్రజా సంఘాలలో ప్రజలు చేరారు. వారి హక్కుల స్థాపనకై పోరాటాన్ని సాగిస్తున్నారు. యీ పీడ కంతటికీ మూల కారణమైన పరిపాలనా విధానానికై కాంగ్రెసు మహా సభలో చేరుతున్నారు. వేర్వేరు ప్రజా సంఘాల ద్వారా సాగే ఉద్యమాన్నంతా క్రోడీకరించి పరపాలనను పారద్రోలుటకు పని చేయవలసిన ఈ రోజులలో కాంగ్రెసు మహా సభ ముందంజ వేయవలసి యున్నది. ప్రజలు ఈ విజృంభణానికి రీయాక్షనరీ శక్తులయిన జమీందారులు, సంస్థానాధీశులు సామ్రాజ్య వాదానుకూలురు గడగడ లాడుతున్నారు. ఈ వెల్లువ నరికట్టుటకు సామ్రాజ్యవాదులు తీరని కృషి చేస్తున్నారు.

ఈ సందర్భంలో ప్రజా పోరాటాన్ని పెంపొందించుటకు పౌరహక్కులను వృద్ధి చేయవలసిన కాంగ్రెసుకు — పోరాట హక్కులను వృద్ధి చేయవలసిన కాంగ్రెసుకు—రీయాక్షనుకు గొడ్డలిపెట్టు పెట్టవలసిన కాంగ్రెసుకు — తాను వెనుక ప్రజాశక్తిని జోడించిన కాంగ్రెసుకు — యింతవరకూ స్వరాజ్య పోరాటాన్ని నడిపించిన కాంగ్రెసుకు — మొన్న ఎ. ఐ. సి. సి. సమావేశంలో పౌరస్వత్వపు హక్కులను గూర్చి ఆమోదించిన తీర్మానం మహాత్ముడు సలహా ఇచ్చినదే అంటే మహాత్ముని సిద్ధాంతమందు అభివృద్ధి కారకమైన స్వభావం అంతరించిందని స్పష్టమవుతోంది. మహాత్ముని యీ సలహా ప్రజా ఉద్యమాన్ని అరికట్టడానికి వినియోగ పడుతుంది. దీనితో అభివృద్ధి నిరోధక స్వభావం తీవ్ర మౌతుంది. ప్రజా సంఘాల అభివృద్ధికి అడ్డు తగులుతుంది. వారి పోరాటాన్ని చెడగొట్టుతుంది. దీనితో కాంగ్రెసు మహాసభ జాతీయ ఐక్యసంఘటనగా మారే ప్రధాన మార్గమే తెగిపోతుంది.

ఇట్టి ఆటంకాన్ని ఆపుచేయుటకు విరివిగా ప్రజా సంఘాలు వ్యాప్తంగావాలి. కాంగ్రెసు సంఘాలను బలపరచాలి. ప్రజల రోజురోజు కష్టాల నివారణకై వాటిచే పని చేయించాలి. ప్రజా హక్కుల విజయానికై వివిధ ప్రజా సంఘాల ద్వారా పోరాటాల నడిపించాలి. కాంగ్రెసు కమిటీలే యీపనికి దిగునట్లుచేయాలి. అప్పుడే కాంగ్రెసు మహాసభ జాతీయైక్య సంఘటనగా మార్చగలుగుతాం. సామ్రాజ్య వాదాన్ని ఆమూలాగ్రముగా రూపుమాప గలుగుతాం. భారత దేశంలో యింతవరకూ జరుగుతూన్న హింస నుండి ప్రజా సామాన్యాన్ని ఉద్ధరించ గలుగుతాం.

అదీ—ఇదీ—అన్నీ

ఆంధ్రరాష్ట్రి ప్రెస్ వర్కర్సు యూనియన్

తృతీయ మహా సభ

అక్టోబరు 30 వ తేది ఆదివారమునాడు యేలూరులో జరుగును. కామ్రేడ్ ప్రొఫెసర్ యన్. జి. రంగా గారిని మహాసభను జయప్రదముగా జరుపుటకు ఆహ్వానించితిమి.

రాష్ట్రి సభకు ప్రతినిధులు రాష్ట్రి కమిటీ సభ్యులను యీ క్రింది రీతిగా ఎన్నుకొని అక్టోబరు 14 వ తేదీ లోపు కార్యదర్శికి పంపవలెను.

నిబంధన 6 (4)

10 మంది లోపు 1 ప్రతినిధి.

ప్రతి పదిమంది యొక ప్రతినిధిని ఎన్నుకొనవలెను. ప్రతి 30 మందికి యొక రాష్ట్రి కమిటీ సభ్యుని యెన్నుకొన వలెను. 30 మంది లోపు వున్నను రాష్ట్రి కమిటీకి యొక సభ్యుని యెన్నుకొనవలెను.

మహా సభ జయప్రదముగా జరుగుటకు ప్రెస్ వర్కర్సు అందరు తమ శక్తి వంచన లేకుండా విరాళములు వసూలుచేసి రాష్ట్రి సంఘమునకు పంప కోరుతున్నాము.

రాష్ట్ర సంఘము విరాళములు ఏలూరు యూనియన్ వారికి యిచ్చెదరు.

ఇట్లు,
పిల్లలమర్రి వెంకటేశ్వర్లు,
కార్యదర్శి.

* * *

కృష్ణా జిల్లా రైతు సంఘము

రైతాంగ విద్యాలయ ప్రారంభము నవంబరు 1 వ తేదీకి మార్పుటచే యీ నెల 8 తేదీన పొట్టిపాడులో జరుగనున్న జిల్లా రైతు సంఘ కార్యనిర్వాహక వర్గ సమావేశమును, విద్యాలయ ఉపసంఘ సమావేశమును నిలుపుచేయడమైనది,

బెజవాడ 3-10-38
సుంకర సూర్యనారాయణ
ప్రధాన కార్యదరి.

* * *

కృష్ణా జిల్లా రైతాంగ విద్యాలయము
తేదీ మార్పు

అఖిల భారత కాంగ్రెసు వర్కింగు కమిటీవారు కాంగ్రెసు సభ్యులను చేర్పించు గడువు అక్టోబరు మాసాంతము వరకు పొడిగించుటచే అక్టోబరు మాసమంతయు కాంగ్రెసు సభ్యులను చేర్పించవలయుననిన్ని అందుచే విద్యాలయమును నవంబరు మాసములో నడుపవలసినదిగా విద్యాలయమునకు రాదలచిన జిల్లాలోని కొందరు కాంగ్రెసు రైతు ప్రచారకుల కోరికపై విద్యాలయపు ఆర్గనైజింగు కమిటీ యీరోజున సమావేశమై విద్యాలయ ప్రారంభము నవంబరు ఒకటవ తేదీకి మార్చుటకు నిశ్చయించినారు. కాన విద్యార్థులెల్లరు గమనింప కోరెదను.

కామినేని వెంకటప్పయ్య
అధ్యక్షుడు
ఆర్గనైజింగు కమిటీ.

మంగళగిరి మహా సభలు.

అక్టోబరు 13 తేది జరుగును.

ఈ వారములో జరుగవలసిన గుంటూరు తాలూకా ప్రధమ రాజకీయ మహా సభయున్నూ, ఆంధ్ర రాష్ట్రి ప్రధమ మోటారు ట్రాన్సుపోర్టర్సు మహా సభయున్నూ రాబోవు అక్టోబరు 13 వ తేదీన జరుపుటకు నిశ్చయించడమైనది. మహా సభల ప్రారంభోత్సకులగు గౌరవనీయులు మద్రాసు స్థానిక పరిపాలన శాఖామంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారును, న్యాయస్థాన జైళ్ల శాఖా మంత్రి గౌ॥ శ్రీ కె. రాముని మీనన్‌గారును ఈ వారములో ఢిల్లీలో జరుగుచున్న అఖిల భారత కాంగ్రెసు సంఘ సభలకు వెళ్ళవలసిన అవసరముండి యుండుటచే ఈ వారములో జరుపబడవలసిన సభలకు రాజాలమనియు, సభల తేది మార్పు చేయవలెననియు, సెలవిచ్చి యుండుటవలన యీ సభలను అక్టోబరు 13 వ తేదీకి మార్పు చేయవలసి వచ్చింది.

మహా సభల ఏర్పాటులు చురుకుగా జరుగుచున్నవి. రెండు సభలకును వెయ్యిమంది ప్రతినిధులు వచ్చెదరని అంచనా వేయబడినది. తాలూకా నుండియును, తదితర ప్రాంతములనుండియు, ప్రేక్షకులు వేలకొలది విచ్చేయుదురని తలంపబడుచున్నది. రాజకీయ మహా సభకు ప్రతినిధి రుసుము రు. 0-8-0 లు మాత్రమే నిర్ణయించ బడినది. మోటారు ట్రాన్సుపోర్టర్సు మహా సభకు రుసుము రు. 1-0-0 మాత్రమే యేర్పాటు చేయబడినది. ఈ రెండు సభలకు విచ్చేయు ప్రతినిధులు అక్టోబరు 9 వ తేదీలోగా ప్రతినిధి రుసుములను చిత్తు తీర్మానములను మహా సభల ఆహ్వాన సంఘ కార్యదర్శికి చేరులాగున పంపవలెను.

ఆంధ్ర రాష్ట్రములోని మోటారు పనివారలందరు మహాసభయొక్క ప్రాముఖ్యతను గుర్తించి విరివిగా విరాళములను పంపి సభలు జయప్రదముగా జరుగుటకు తోడ్పడుదురనియు, విరివిగా ప్రతినిధులు విచ్చేయుదురనియు ఆశించుచున్నాము.

ఇట్లు,
మంగళగిరి, 25-9-38
కాళంగి వెంకటరత్నం,
ఆహ్వాన సంఘ కార్యదర్శి.

* * *

గన్నవరం తాలూకా ప్రజల కొక విజ్ఞప్తి.

ప్రభుత్వ శాఖలలో ముఖ్యముగా పి. డబ్ల్యు. డి. పోలీసు, రిజిస్ట్రేషన్, జుడిషియల్ శాఖలలో ప్రబలియున్న లంచగొండితనమును నిర్మూలించుటకై పశ్చిమ కృష్ణా జిల్లా కాంగ్రెసు కమిటీవారిచే నియమింపబడిన సబు కమిటీవారు యీ నెల 3 వ తేదీ లగాయితు 10 వ తేదీవరకు సంచారము చేసి 20 గ్రామములలో బహిరంగ సభలు, విచారణలు జరిపినారు. సభలకు ప్రజలు విరివిగా వచ్చి, వివిధ శాఖలలోని ఉద్యోగస్థులకు తాము యిచ్చిన లంచముల గురించిన్నీ, తమను అధికారులు పెట్టు నిర్బంధములను గురించిన్నీ చాలా స్టేటుమెంటుల నిచ్చినారు. ఆ యా శాఖలలోని ఉద్యోగస్థులపై చర్య జరుపుటకు ఇంకా విపులముగా సాక్ష్యములు, రికార్డు అవుసరము గాన తాలూకాలోని ప్రజలందరు యీ సదవకాశమును గమనించి వారి వారికున్న ఇబ్బందులను గురించి తాలూకా కాంగ్రెసు సంఘమునకు వెంటనే తెలియపర్చ గోరుచున్నాము. స్టేటుమెంటులు అతి రహస్యముగా నుంచబడుతవి. కమిటీ వారు వచ్చే నెలలో ఇంకా రెండు పర్యాయములు షుమారు పది రోజులు మన తాలూకాలో సంచారము చేయ నిశ్చయించుకున్నారు. సెంటర్లు ముందుగా నిర్ణయించి ప్రకటించెదము. ఆపైన ఏవిధముగా చర్యలు జరుపవలెనో కమిటీ వారు విచారించి తగువిధమైన చర్య గైకొనెదరు. దారిద్ర్యముచే కృంగిపోవుచున్న జనసామాన్యమును మరింత కృంగదీయుచున్న యీ లంచగొండితనమును రూపు మాపుటకు ప్రజ లందరు తోడ్పడ ప్రార్థన.

గన్నవరం 24-9-38
ఇట్లు
తాలూకా కాంగ్రెసు కమిటీ.

* * *

రాజకీయ విజ్ఞాన పరిషత్తు, కాకినాడ.

ఆర్థిక రాజకీయ విజ్ఞాన సంఘ కార్యదర్శి యిట్లు తెలియజేయుచున్నారు:

ప్రజా సేవకులకు,ఆర్థిక రాజకీయ విజ్ఞానము ఒసంగుటకై ఒక స్థిరమైన రాజకీయ విజ్ఞాన పరిషత్తు అక్టో 10 వ తేదీ నుండి కాకినాడలో స్థాపింపబడును. ఇచ్చట విద్య గరపుటయే కాక వివిధ రాజకీయ సమస్యలమీద పరిశోధన చేయుటకు తగు ఏర్పాట్లు చేయబడుచు.

ఈ క్రింది విషయములమీద విద్య గరపబడును.

1. భారతదేశ రాజకీయాలు, 2. ప్రపంచ రాజకీయాలు, 3. ఆర్థిక శాస్త్రము, 4. కార్మికోద్యమము, 5. కిసాను ఉద్యమము, 6. ఆధునిక రచన.

నేర్చుకొనెడి కాల పరిమితి 15 దినముల నుండి 3 నెలల వరకు.

పరిశోధన సమస్యలు, విద్యార్థుల సామర్థ్యతను, అభిలాషను బట్టి నిర్ణయించ బడును.

విద్య, బస యేర్పాట్లు ఉచితముగా ఒసగ బడును. భోజనాల యేర్పాట్లుమాత్రము విద్యార్థులు నిర్ణయించుకోవలెను. కాకినాడ కాంగ్రెసు సోషలిస్టు పార్టీ కార్యదర్శి డాక్టరు యం.వి. వీరయ్యగారు గాంధీనగరములో బసలు యేర్పాటు చేయుటకు వాగ్దానము చేసిరి. డాక్టరు వీరయ్యగారు యీ మధ్య రాజమండ్రి ఆర్థిక రాజకీయ పాఠశాలలో విద్యార్థులకు ఉచితముగా తమ హాస్పటలు నెలకొల్పారు.

ప్రస్తుతము వీలును బట్టి 20 మంది విద్యార్థులు మాత్రమే తీసుకోబడుదురు. కాంగ్రెసు, సోషలిస్టు, కిసాను లేక కార్మికోద్యమములలో పనిచేయుచున్న వారలు లేక ప్రజా సేవకు పాటుపడెడు వారలకు మొదట స్థానము లివ్వబడును.

దరఖాస్తులు అక్టోబరు 8 వ తేదీలోగా పంపవలెను. వివరములు కోరువారు యీ దిగువ ఎడ్రసుకు వ్రాయవలెను.

సి. వి. కృష్ణారావు
జగన్నాధపురము, కాకినాడ.

* * *

సెప్టెంబరు 18 వ తేదీ వాహిని పేపరులో నవరత్నములు అను శీర్షిక క్రింద నందిగామ తాలూకా రైతు సంఘం తరపున నేను ఫ్యాక్టరీలను గురించి వ్రాసినట్లు ప్రకటింపడెను. నేను అట్టి రిపోర్టు పంపించలేదని తెలుపుచున్నాను.

యేజెళ్ళ వెంకట సుబ్బయ్య
నం. తా. రైతు సంఘ కార్యదర్శి,
26—9—38

యువకులను గూర్చి కాంగ్రెస్ శ్రద్ధ తీసుకోవాలి.

ఆట పాటలద్వారా, శిక్షణలద్వారా యువకులను ★ ★ ★ ★ ★ ★ జాతీయ సైనికులగా తయారు చేయాలి.

శ్రీ చంద్ర రాజేశ్వరరావు

ప్రపంచములో ఇప్పటివరకూ జరిగిన ప్రజాసామాన్య విప్లవాలను గూర్చి జ్ఞాపకం వచ్చినపుడు ఒక్క విషయం మాత్రం మరచిపోవటానికి వీలు లేకుండా మాటిమాటికీ మనస్సును వేధించుతుంది. ఇతర దేశములలో యువకులు విప్లవాలలో పాల్గొన్నంతగా మన ఇండియా దేశములో స్వాతంత్రోద్యమములో పాల్గొనుట లేదు. 1860 లో ఇటలీలో జరిగిన స్వాతంత్ర్య విప్లవాన్ని జయం పొందించినది యువకులే. 'మాజినీ'చే స్థాపింపబడిన ఇటలీ యువక సంఘం (young Italian league) నాయకత్వాననే ప్రజా సామాన్యం ఆస్ట్రియా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఆస్ట్రియా చేతి నుండి ఇటలీని తప్పించటానికి పోరాడింది. గారిబాల్డీ నాయకత్వాన 1000 మంది యువకులు ఇటలీలోని బోర్బన్ రాజు మీద తిరుగబడి సిసిలీని, దక్షిణ ఇటలీని దుర్భరమగు బోర్బన్ పరిపాలన నుండి రక్షించి, ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని నెలకొల్పటానికి దారి తీశారు. ఆ వెయ్యి మంది యువకులలో 12, 13 సంవత్సరాల వయస్సుగలవారు కూడా ఉన్నారు. 1918 లో సుల్తానును తొలగించి బ్రిటిషు, ఫ్రెంచి సామ్రాజ్యవాదుల బారి నుండి టర్కీని రక్షించి, పురాతనపు పద్ధతులను తీసివేసి, టర్కీ దేశాన్ని యూరపు దేశాలతో సమాన స్థాయిలోనికి తీసుకు వచ్చిందీ తురుష్క పార్టీ అను యువక సంస్థయే. రష్యాలో జారు ప్రభుత్వాన్ని పోగొట్టి సమస్త ప్రజలు సౌఖ్యంగా జీవించటానికి వీలున్న సోవియటు ప్రభుత్వాన్ని స్థాపింపడానికి కమ్యూనిస్టు పార్టీకి ఎక్కువగా తోడ్పడ్డదీ రష్యా యువకులే. ఇప్పుడు స్పెయిన్, చైనాలలో జర్మన్, ఇటాలియన్, జపాన్ ఫేసిస్టుల దారుణ కృత్యాలకు ప్రాణాలకు లెక్క చేయకుండా దినానికి వేలకు వేల చొప్పున బలిఅవుతూ తమ రక్తంతో ప్రజాస్వామ్య ప్రభుత్వాలను గాపాడేదీ స్పెయిన్, చైనా యువకులే.

ఏ దేశ చరిత్ర చదివినా ఇదే పదే పదే తటస్థిస్తుంది. మన దేశము యొక్క స్వతంత్ర పోరాటంలో యువకులు కొంతవరకు పాల్గొంటున్నా అంత విరివిగా లేదు. మన దేశ యువకుల ఆరోగ్యం నానాటికి క్షీణించుతోంది. అజ్ఞానం గూడ హెచ్చుతూనే ఉంట, అందులో మన రాష్ట్రి యువకులు మరీ అధోగతిలోనున్నారు. పట్నాలలో నున్న యువకులు చాల మంది నిరుద్యోగులయి తాగుడు, జూదం మొదలైన దుర్వ్యసనాలకు లోబడి ఆరోగ్యాన్ని పరువు, మర్యాదాల్ని గోల్పోయి రౌడీలయి తిరుగు తున్నారు. ప్రతి పట్నంలోనూ (Joyland Shows) జాయిలండు షోస్ అనే జూద గృహాలు ఉన్నాయి. వీటిని గవర్నమెంటువారు నిషేధించలేదు. ఏ కొద్ది మందో యువకులు ఆట పాటలలో కాలం గడుపుతున్నారు. ఆ యువకుల క్లబ్బులన్నీ రాజకీయాలతో సంబంధంలేని వారిచేతనో, గవర్నమెంటు ఉద్యోగస్తుల చేతతో నడపబడుటచేత, ఆ యువకులు స్వాతంత్రోద్యమంతో సంబంధం లేకుండా ఉన్నారు. ఇంక విద్యార్థుల సంగతి ఆలోచించుదామా అంటే అదీ అట్లాగే ఉంది. నామకా వారానికి ఒక రోజు ఉంటుంది. ఆడుకోవటానికి బంతులు, నెట్లు మొదలయిన పరికరాలు బహు కొద్దిగా నూటికి 99 మంది ఆడుకోవటానికి అవకాశాలు ఉండనే ఉండవు. ఆటలు ఫీజు మటుకు గట్టిగా వసూలు చేస్తారు. ఆ డబ్బు ఇతర పనులకు కాలేజీ వారు ఉపయోగించు కొంటారు. అన్ని యూనివర్సిటీలలో విద్యార్థులకు మిలటరీ శిక్షణ ఇవ్వటానికి U. T. C. లు ఉన్నా మన ఆంధ్ర యూనివర్సిటీలో ఎందుకు లేదో? ఇది యూనివర్సిటీవారి అశ్రద్ధయా. మరేమయినానా? ప్రాధమిక పాఠశాలలలో డ్రిల్లు మొదలయినవి నేర్పాలని సిలబసు కాగితము మీద ఉంటుంది. అసలు ఉపాధ్యాయులకు వస్తేగా పిల్లలకు నేర్పటానికి! గవర్నమెంటుకు కావలసింది విద్యార్థులు గుమాస్తాలుగానే తయారు గావటం గనుక కలము పుల్ల, కాగితం ముక్క తప్పితే వేరే వాటిని గవర్నమెంటు ముట్టుకో నియ్యదు. మన యూనివర్సిటీ, కాలేజీ, స్కూళ్ళను నడిపేవారు బ్రిటిషు ప్రభుత్వ గులాములు లనుక ప్రభుత్వానికి ప్రక్కతాళం వేస్తారు.

ఇక పల్లెటూళ్ళ రైతు యువకుల గతి. డెల్టా గ్రామాలలోని రైతు యువకులు చాలమంది పనులు చేయుటం మానివేశారు. జూదం, త్రాగుడు, గొర్రెపోతు, కోడిపుంజు పందాలలో దిగి ఆస్తులన్నీ పోగొట్టుకొని పకీరులవు తున్నారు. సంక్రాంతి పండుగకు ప్రతి ఊరిలోనూ కోడి పందాలు, కోసులు, సారా దుకాణాలు ఎంతో జోరుగా సాగుతాయి. కొన్ని గ్రామాలలో జూదమే వృత్తిగా బెట్టుకొన్న యువకులు గూడా ఉన్నారు. వీరు మన దేశానికి చీడ పురుగులు. కలరావంటి వారు. మా కృష్ణా జిల్లాలో వారానికి కనీసం ఒక్క గొర్రెపోతు పందెమైనా ఉంటుంది. వేల తరబటీ వాటిమీద పందాలు కాస్తారు. ఓడిపోయిన వారి డబ్బా పోతుంది. గెలిచినవారు జల్సా చేసి ఖర్చు పెట్టుతారు. ఓడిపోయిన వారికీ గెలిచిన వారికీ యిద్దరికి క్షౌరం, కర్రసాము, కత్తిసాము మొదలయిన విద్యలు పల్లెటూళ్ళలో ఉన్నా అవి రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తుల చేతిలో ఉండటంవల్ల గురువుల మధ్య నున్న తగాదాలు శిష్యులకు ప్రాకి లేని పోని పార్టీలు, కొట్లాటలకు కారణము గూడా అవుతున్నవి.

మన రాష్ట్రంలో స్కౌటు ఉద్యమం ఉన్నా ఆ ఉద్యమం బ్రిటిషు సామ్రాజ్య వాదులచే తమ లాభం కొరకు ఆరంభింపబడినది. మన ఇండియా గవర్నమెంటువారు దీనిని ప్రోత్సహించి యువకులను తమ వైపుకు త్రిప్పుకొని స్వతంత్ర పోరాటము యొక్క వాసన తగులకుండా కాపాడుతున్నారు. ఎప్పుడూ బ్రిటిష్ జాతీయ పాటను పాడించుట, బ్రిటిషు జండా అయిన యూనియన్ జాక్‌కు పెట్టించుట చేస్తారు.

ఇంక మెట్ట గ్రామాలలో రైతు, కూలీ యువకుల సంగతి ఏమంటే వారు వ్యవసాయపు పని చేయటం వల్ల ఆరోగ్యవంతులుగా ఉన్నా వారికి లోకజ్ఞానమేమీ లేదు. ఇండియా దేశము ఏమిటో, ఆంధ్ర రాష్ట్రం ఏమిటో, కాంగ్రెసు ఏమిటో స్వతంత్ర పోరాటమేమిటో ఏమీ తెలియదు.

బ్రిటిషు సామ్రాజ్యవాదులు కోరే దేమిటి? మన దేశ యువకులు బలహీనులుగా ఉండటం, దురభ్యాసాలకు లోను గావటం, ప్రపంచ జ్ఞానం లేని పశువులుగా ఉండటం. లేకపోతే వారి ప్రభుత్వం ఎలా సాగుతుంది? 35 కోట్ల భారతీయులను ఏవిధంగా బానిసలుగా ఉంచటం, అందువలన సారా, గంజాయి, జూదం మొదలగు వాటికి లైసెన్సు లిచ్చి నడుపుతున్నారు.

ఈ పై విధంగా ఇంకా కొన్ని రోజులు సాగితే మన ఆంధ్ర రాష్ట్ర యువకులు ఆరోగ్యాన్ని పూర్తిగా కోల్పోవటమే గాకుండా, దుర్వ్యసనాలకు పూర్తిగా లోబడి స్వతంత్ర సమరాన్ని అణచటానికి బ్రిటిష్ గవర్నమెంటుకు తోడ్పతారనే భయం గూడా వేస్తోంది.

ఇది యువకుల తప్పు గాదు. వారికి వేరే ప్రోగ్రాం లేనప్పుడు దుర్వ్యసనాలకు లోనవుతారు. యువకులను సరియైన మార్గంలో నడపవలసినబాధ్యత మన జాతీయ సంస్థ - నేషనల్ కాంగ్రెసు - మీద ఉంది. 53 సంవత్సరాల నుండీ కాంగ్రెసు సాగుతూవస్తున్నా ఇంతవరకూ కాంగ్రెసు యువకుల మనోప్రవృత్తిని సరిగా అర్థంజేసుకొని ప్రోగ్రామును ఇవ్వలేకపోయింది. రాట్నం వడకండి, హిందీ నేర్చుకోండి, భగవద్గీత పారాయణం చెయ్యండి అని బోధించింది. యువకులు హిందీ నేర్చుకోవటం, రాట్నం వడకటంతోనే సంతృప్తి పడరు. వారి రక్తనాళాలలో వేడి నెత్తురు ప్రవహించుతోంది. ఆటలు ఆడాలి. కసరత్తు చెయ్యాలి. స్వతంత్ర పోరాటంలో సైనికులుగా ఉండమంటే ఉంటారు. వాలంటీర్లను కాంగ్రెసు మహాసభా సమావేశములప్పుడు తయారుచేసినా సభ అయిన తరువాత వాలంటీరు సంస్థను రద్దు చేస్తారు. హార్డికరు గారిచే స్థాపింపబడిన హిందూస్థాన్ సేవాదళం శాసనోల్లంఘనోద్యమంలో కాంగ్రెసు క్రిందికి తీసుకొన్నా ఉద్యమము ఆగినవెంటనే దానిని పునరుద్ధరించ లేదు.


హిట్లరు జర్మనీలో అధికారానికి వచ్చాడంటే యువకుల ద్వారానే. 10 లక్షలమంది 'స్టార్మ్ ట్రూపర్సు' అనే యువక సైన్యాన్ని తయారు చేశాడు. ఆటలు, పాటలు అభివృద్ధి చేసి యువకులను ఆకర్షించాడు. ఇప్పటికీ ఆటలు పాటలు మొదలైన వాటికి ప్రాముఖ్యత ఒసంగుతాడు. ప్రపంచములోని ఫాసిస్టులంతా యువకుల మీదనే కేంద్రీకరించారు. అయితే వీరు యువకులను ఆకర్షించి ప్రజాసామాన్యాన్ని అణచి, పెట్టుబడిదార్లు మొదలయిన దోపిడిగాండ్ర సహాయానికి ఉపయోగిస్తున్నారు. జకోస్లొవేకియా స్వతంత్రాన్ని సంపా

(మిగతా 18 వ పేజీలో)

ప్రపంచ శాంతిని భగ్నపఱచే బ్రిటన్

జకోస్లొవేకియాకు బ్రిటన్ ద్రోహం

జవహర్‌లాల్ నెహ్రూ



"నేను భారతదేశ స్వాతంత్ర్యాన్ని, ప్రపంచ శాంతిని కోరే ఒక భారతీయుడిని. స్పెయిన్‌లోను, జెకోస్లొవేకియాలోను యీమధ్య జరిగిన ఘటనలను అత్యంత శ్రద్ధతో పరిశీలించాను. బ్రిటిష్‌వారి విదేశ రాజ్యాంగనీతి, మా దృష్టిలో, మొదటినుంచీ అభివృద్ధి నిరోధకంగాను ప్రజాతంత్ర సూత్రాలకు విరుద్ధంగాను కనపడింది. ఫేసిస్టులయొక్క, నాజీలయొక్క అన్యదేశాక్రమణ విధానాన్ని యీ విదేశ రాజ్యాంగనీతి ప్రోత్సహిస్తూ వచ్చింది కాబట్టి కొన్ని సంవత్సరాల నుండి ఇండియన్ నేషనల్ కాంగ్రెసు యీ బ్రిటిష్ విదేశ రాజ్యాంగనీతిని ఖండించడమేగాక, దానితో యెట్టి సంబంధమును పెట్టుకోలేదు.

మంచూరియా, పాలస్టయిన్, అబిసీనియా, స్పెయిన్.

మంచూరియా, పాలస్టయిన్, అబిసీనియా స్పెయిన్ దేశాలలో జరిగిన ఘటనలు భారతీయులను ఆందోళన పరిచాయి. మంచూరియాలో అన్య రాజ్యాక్రమణ విధానానికి ప్రోత్సాహం యిచ్చే పునాదులు వేయబడ్డాయి. అంతర్జాతీయ న్యాయశాస్త్రానికి సంబంధించిన నిబంధనలు, నియమాలు అన్నీ నిర్లక్ష్యం చేయబడ్డాయి. నానాజాతి సమితికి ఎన్నో ఆటంకాలు కల్పించబడ్డాయి. ఐరోపాలో, భయంకరమైనట్టియు, అమానుషమైనట్టియు, నిరంకుశ విధానానికి గురికావలసి వచ్చిన యూదుజాతి వారి బాధల యెడల మాకు సంపూర్ణమైన సానుభూతియు, సామరస్యభావము ఉన్నాయి; కాని పాలస్టయిన్‌లో నేడు జరుగుతూన్న పోరాటం జాతీయ స్వాతంత్ర్యం కొరకే నని మేము గుర్తించాము. బ్రిటిష్ సామ్రాజ్య వాదులు ఇండియాకు ఉన్న రాకపోక మార్గాన్ని తమ స్వాధీనంలో ఉంచుకొనుటకు యీ స్వాతంత్ర్య పోరాటాన్ని దౌర్జన్య విధానంతో అణచివేయుటకు పూనుకొన్నారు. అబిసీనియాలో, ధైర్యవంతమైన ఒక జాతి నీచంగా ద్రోహం చేయబడ్డారు. స్పెయిన్‌లో, ప్రజా ప్రభుత్వాన్ని నానా యిబ్బందులు పెట్టి తిరుగుబాటుదార్లకు ప్రోత్సాహం యిచ్చుటకు అవలంబించ వలసిన పద్ధతులన్నీ అవలంబించ బడ్డాయి. స్పెయిన్ ప్రజా ప్రభుత్వం ఓడిపోవాలి అనో, లేక తప్పక ఓడిపోతుంది అనో నిశ్చయానికి వచ్చి బ్రిటిష్ ప్రభుత్వం తమ యీ నిశ్చయాన్ని నెరవేర్చుకొనే నిమిత్తం రకరకాల పద్ధతులు అవలంబించింది. తిరుగుబాటుదార్లు కలిగించిన అవమానాలు, అపకారాలు సహించి ఊరుకున్నారు.

ఫలితం.

"ప్రతి చోట యీ విధానం నిష్ప్రయోజనమయింది. అయినప్పటికి, బ్రిటిషు ప్రభుత్వం దీన్ని విడిచిపెట్టటంలేదు. ఆ నాడు అబిసీనియాలో జరిగిన భయంకర హత్యా కాండకు ఫలితాలు యీ రోజున ప్రపంచమంతటిలోను మనం చూస్తున్నాం. ప్యాలస్టయిన్ సమస్య నానాటికి తీవ్ర మౌతుంది. దౌర్జన్యాన్ని అరికట్టుటకు యింకా యెక్కువ దౌర్జన్యం చేయవలసి వస్తోంది. అక్కడి ప్రజలను లొంగదీసే ప్రయత్నంలో బ్రిటిషు ప్రభుత్వం సైనిక దళాల చేత క్రూరమయిన హింసా విధానం అమలు పరుస్తోంది. ఈ సమస్య యెక్కువగా బ్రిటిషు ప్రభుత్వంచే సృష్టింపబడినదను విషయం చాలా మంది మరిచిపోతున్నారు. ఇంత వరకు అక్కడ జరిగిన ఘటనలకు బ్రిటిషు ప్రభుత్వానిదే బాధ్యత. అబిసీనియా యింకా ఓడిపోలేదని మీ పత్రికా విలేఖరే వ్రాస్తున్నాడు. ఓడి పోదని కూడా ఊహించ వచ్చు. స్పెయిన్ దేశపు సాహస ప్రజలు బ్రిటిషు ప్రభుత్వం యొక్క కోరికలకు లొంగి పోవద్దని నిశ్చయించుకొన్నారు. వారిని నాశనం చేయుటగాని, అణచుటగాని యెవరికీ సాధ్యం కాదని లోకానికి వెల్లడించారు."

ప్రపంచ యుద్ధం.

"మొదటి నుంచీ విధానం నిష్ఫలం అయింది అయినప్పటికీ, బ్రిటిషు ప్రభుత్వం గుణపాఠం నేర్చుకొని సరియైన మార్గాలు అవలంబించ లేక పోతుంది. పైగా, అన్య రాజ్యాక్రమణను ప్రోత్సహించి, నాజీ ప్రభుత్వాలకు సహాయం చేసే విధానం పూర్వం కంటె యెక్కువ తీవ్రంగా అనుసరిస్తుంది. ఈ విధానం అరికట్టబడకపోతే, బ్రిటిషు ప్రభుత్వం యిక ముందు కూడా యిట్టి పంథానే అనుసరిస్తుంది: ఇందుకు సందేహం యే మాత్రం లేదు, తనకూ, తన సామ్రాజ్యానికి వినాశ కాలం వచ్చే పర్యంతం యీ ధోరణిని గ్రేట్ బ్రిటన్ మార్చుకోదు. ఎందువల్లనంటే, బ్రిటన్‌లోని కొన్ని వర్గాలు ఫేసిస్టు దేశాలకు సానుభూతిని గలిగియుండి, ఆ వైపే మొగ్గడం, ఇట్టి వర్గాల పలుకుబడి ఆ దేశంలో విస్తారంగా ఉండడం, అన్ని విషయాల కంటె యెక్కువ ప్రాధాన్యత వహించి యున్నాయి. బ్రిటిషు సామ్రాజ్యం నశిస్తే, తప్పకుండా ప్రపంచానికంతటికీ లాభం. సామ్రాజ్య వాద వినాశనానికి నేను ఏ మాత్రం అభ్యంతరం పెట్టను. కాని, ప్రపంచ యుద్ధం విషయమై నేను తీవ్రంగా ఆందోళన పడుతున్నాను. బ్రిటన్ విదేశ రాజ్యాంగ నీతి ప్రపంచ యుద్ధం వైపుకు ఏ విధంగా దారి తీస్తోందో నేను గ్రహించినప్పుడు నేను అమితంగా బాధ పడతాను. ఈ విషయంలో హిట్లర్ తుది నిర్ణయం అయినప్పటికీ, యీ నిర్ణయం చాలా వరకు బ్రిటిషు వైఖరిపై ఆధారపడియుంటుంది. ఇంత వరకూ యీ వైఖరి హిట్లరును ప్రోత్సహిస్తుంది; జెకోస్లొవేకియాను దబాయించి బెదరించడంలో కావలసినంత సహాయం చేసింది. కాబట్టి, యుద్ధమే వస్తే, దానికి చాలా వరకు బ్రిటిషు ప్రభుత్వమే బాధ్యత వహించవలసి యుంటుందని సంతృప్తి చెందడమో లేక విచార పడడమో జరగాలి. నేటి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చిన బ్రిటిషు ప్రజలు యీ సత్యాన్ని గ్రహించి ఎంత వరకు సంతోషిస్తారో చూడవలసి యుంది.

అసహ్యత

"నేటి బ్రిటిష్ ప్రభుత్వం అకస్మాత్తుగా అభివృద్ధిని వాంఛించేదిగా గాని, ప్రపంచ శాంతి కొరకు కృషి చేసేదిగా గాని మారితే తప్ప, యీ ప్రభుత్వం యొక్క చర్య లేవీ నాలో ఆశ్చర్యాన్ని కలుగజేయజాలవని నేను అనుకొనే వాణ్ణి. కాని నా అభిప్రాయం పొరబాటు, ఎందువల్లనంటే, జెకోస్లొవేకియాలో యీమధ్య జరిగిన ఘటనలు, బ్రిటిష్ ప్రభుత్వం, మాటిమాటికీ, ప్రత్యక్షంగాను రాయబారుల ద్వారాను జెక్ ప్రభుత్వాన్ని బెదిరించడానికి అవలంబించిన పద్ధతులు చూచాక నాకు బ్రిటిష్ ప్రభుత్వం యెడల అసహ్యత యేర్పడింది. ఈ విధానాన్ని చూస్తూ ఏమాత్రం విశాల భావాలుగల ఆంగ్లేయుడైనా ఎట్లు సహించ గలుగుతున్నాడా అని ఆశ్చర్యం కలుగుతోంది. ప్రపంచ శాంతిని గురించి అంత బిగ్గరగా అరచేవారే ఈవిధంగా ఆచరణలోగాని ఇతర విధాలలోగాని, యుద్ధాన్ని ప్రత్యక్షముగా ఆహ్వానించే విధానాన్ని బలపరుస్తూ యెట్లు ఉండగలరా అని నాకు మరింత ఆశ్చర్యం కలుగుతోంది.

జకోస్లొవేకియా సమస్య యొక్క మూల రహస్యం.

"ఈమధ్య నేను జెకోస్లొవేకియాలో కొంత కాలం గడిపాను. అనేకమంది జెక్కులతోను, జర్మన్‌లతోను మాట్లాడాను. జెక్కుల అద్భుతమైన సహనబుద్ధిని, జర్మన్‌ల ప్రజాతంత్ర శీలాన్ని చూచి ఆశ్చర్యపడ్డాను. అతి ప్రమాదకరమైన వాతావరణంలో, అన్యదేశీయుల బెదరింపుల మధ్య, వీరు శాంతముగాను, సంతోషంతోను జీవితం గడుపుతున్నారు. ప్రపంచ శాంతిని కాపాడ్డానికి వీరెంతో ఆదుర్దా పడుతున్నారు. కాని తమ జాతీయ స్వాతంత్ర్యాన్ని పోగొట్టుటకు ఏమాత్రం యిష్టపడ్డంలేదు. వార్తలలో మనం చూచినట్లు, జెక్ ప్రభుత్వం అల్ప సంఖ్యాకుల ప్రతి కోరికను నెరవేర్చుటకై, ప్రపంచ శాంతిని కాపాడ్డానికి ఎంత వరకైనా వెళ్ళడానికి కృతనిశ్చయులై యున్నారు. కాని, జెకోస్లొవేకియాలో నేటి సమస్య అల్ప సంఖ్యాకులకు సంబంధించినది కానేకాదని ప్రతివానికీ తెలుసు. నిజంగా, అల్ప సంఖ్యాకుల సమస్యే అక్కడి ప్రజలను ప్రోత్సహిస్తే, ఇటలీలోగాని పోలెండ్‌లోగాని జర్మన్ అల్ప సంఖ్యాకుల సమస్యను గురించి మనం యెప్పుడూ వినడం లేదేమి? నిజమైన సమస్య యేమంటే, రాజకీయాలలో పెత్తనం సంపాదించడమే. సోవియట్‌కూ జెకోస్లొవేకియాకు మధ్యనున్న ఒడంబడికను భగ్నంచేయుట; మధ్య యూరప్‌లో నేడు మిగిలియున్న ఒకే ప్రజాతంత్ర రాజ్యాన్ని (జెకోస్లొవేకియా) ధ్వంసం చేయుట; రుమేనియా యందలి పెట్రోలు గనులకు, గోధుమ పంటకు చేరువగా ఉండేటట్లు దేశాన్ని విస్తరించుకొనుట; యీ విధంగా యూరప్ ఖండం అంతటిలోను బలవత్తరమైన రాజ్యంగా అగుట; యీ ఉద్దేశాలు జర్మన్ నాజీలను ప్రోత్సహించాయి. జెకోస్లొవేకియా మీదికి ఉరకడానికి. బ్రిటిష్ విదేశ రాజ్యాంగనీతి యీ విధానానికి మద్దత్తు యిచ్చింది. ప్రజాతంత్ర రాజ్యంఅయిన జెకోస్లొవేకియాను బలహీన పరిచింది.

భారతీయుల వైఖరి.

"ఏది యెట్లున్నప్పటికీ, భారతీయులమైన మేము ఫేసిజానికిగాని, సామ్రాజ్య వాదానికిగాని అనుకూలురము కాము. ఈ రెండూ ప్రపంచ శాంతికీ, జాతీయ స్వాతంత్రానికీ తీరని ముప్పు కలుగుజేస్తాయని మేము పూర్వంకంటే యిప్పుడు స్పష్టంగా గ్రహించాము. బ్రిటిషు విదేశ రాజ్యాంగ నీతిని ఇండియా పూర్తిగా తిరస్కరిస్తోంది. దాంట్లో యెట్టి భాగం తీసుకోదు. ఈ అభివృద్ధి నిరోధక శక్తికీ మాకూ మధ్య ఉన్న సంబంధాన్ని తెంచుకొనుటకు మా శక్తి అంతటినీ ఉపయోగిస్తాం. మేము సంపూర్ణ స్వాతంత్ర్యం కోరడానికి బ్రిటిషు ప్రభుత్వం యిప్పుడు మరొక కొత్త కారణాన్ని చూపు చూపింది. దీనికెవరూ అడ్డు చెప్పలేరు.

జెకోస్లొవేకియాతో మాకు పూర్తియైన సానుభూతి ఉన్నది. యుద్ధం వస్తే, బ్రిటిషు ప్రభుత్వం ఫేసిస్టు దేశాల యెడల అనుకూల వైఖరి చూపుతూన్నప్పటికీ, బ్రిటిషు ప్రజలు యుద్ధంతో పాల్గొనుట తప్పని సరి అవుతుంది. కాని, అప్పుడైనా, ఫేసిస్టు-నాజీ రాజ్యాల యెడల సానుభూతి గల యీ ప్రభుత్వం ఏ మొగంతో ప్రజాస్వామ్య పరిపాలన కొరకు, స్వాతంత్ర్యం కొరకు పాటు పడుతున్నానని లోకానికి చాట గలదు? ఈ ప్రభుత్వం (ఛాంబర్లైన్ ప్రభుత్వం) అధికారంలో ఉన్నంత కాలం ఫేసిజం యెల్లప్పుడూ దౌర్జన్యానికి దారి తీస్తూనే ఉంటుంది.

"విదేశీయులు యుద్ధాన్ని గురించి చేసే నిర్ణయాలకు భారతీయులు లొంగరు. వారే నిర్ణయించుకోవాలి. బ్రిటిష్ ప్రభుత్వం నిరంకుశంగా మాపై రుద్దజూచే నిర్ణయాన్ని మేము అంగీకరించము. వారిని భారతీయులు ఏమాత్రం విశ్వసించరు. ప్రజా రాజ్యాలవైపు, స్వాతంత్ర్యం వైపు ఉండి, వారు సంతోష పూర్వకంగా సహాయం చేస్తారు. కాని, యీమాటలే మేము 20 సంవత్సరాల క్రితం, అంతకుముందు అనేక సార్లు విన్నాము. స్వాతంత్ర్యం, ప్రజా పరిపాలనగల దేశాలే యితర ప్రదేశాలలో వీటిని కాపాడగలవు. గ్రేట్ బ్రిటన్ ప్రజారాజ్యాల వైపువుండి పోరాడితే, మొట్టమొదట చేయవలసినది ఇండియాలో సామ్రాజ్య వాదాన్ని రద్దు చేయడమే. భారతీయుల దృష్టిలో యీ విధంగా జరగక తప్పదు. అట్టి వైఖరినే వారు కలిగియుంటారు.

"మాంచెస్టర్ గార్డియన్" (లండన్) వారపత్రిక నుండి 8—9—38

యువకులు — కాంగ్రెసు

(16 వ పేజీ తరువాయి)

దించుకోవటానికి సహాయం చేసినది. ఆ దేశమంతా వ్యాపించిన 'స్పోర్ట్సు కాంగ్రెసు'. ఇప్పుడు ఆకాంగ్రెసు యొక్క సభ్యుల సంఖ్య షుమారు 50 లక్షలు. ఆట పాటల పోటీలో షుమారు 35 వేల మంది పాల్గొంటారు. ఈ సంస్థ జర్మనీ నుండి జకోస్లావేకియాను కాపాడటానికి కంకణం కట్టుకొంది. స్వాతంత్ర్యాన్ని సంపాదించటానికి కంకణం కట్టుకొన్న ప్రతి సంస్థా యువకులను ఆకర్షించాలి. అలా చేయలేకపోతే ఆసంస్థ తన గమ్యస్థానాన్ని చేరలేదు. కాంగ్రెసు స్వతంత్రాన్ని సంపాదించాలంటే ఆటపాటలు దేశమంతటా వ్యాపింపజేసి యువకులను ఆకర్షించాలి.

ఇప్పటికైై కాంగ్రెసు యువకులను గూర్చి శ్రద్ధ తీసుకోవాలి.

సంయుక్త రాష్ట్ర కాంగ్రెసు కమిటీ దారి జూపింది. ఈ సంవత్సరము ఆఖరకు ఒక లక్ష మంది గల వాలంటీరు దళాన్ని స్థాపించటానికి తీర్మానించు కుంది. అప్పుడే ఆ దళంలో 50 వేల మందిని జేర్చింది. తర్ఫీదు ఇస్తోంది. అఖిల భారత కాంగ్రెసు సంఘం అన్ని రాష్ట్రాలలోనూ వాలంటీరు దళాలు ఏర్పాటు చేసేటట్లు రాష్ట్ర కాంగ్రెసు కమిటీలకు ఉత్తర్వులు పంపాలి.

ఇతర రాష్ట్రాలలోని యువకుల స్థితి కొంత నయం. బెంగాలులోని యువకులు ఆట పాటలను అభివృద్ధి చేసుకొంటున్నారు. మహా రాష్ట్ర దేశంలో వ్యాయామ మండలాలు రోజు రోజుకు పెరిగి పోతున్నవి. చిన్న యువతులు గూడా స్వరక్షణోపాయాలను నేర్చుకొంటున్నారు. సంయుక్త రాష్ట్రాలు, పంజాబులలో యువకులు కర్రసాము, కత్తిసాము, కుస్తీలు చేస్తూ ఉంటారు. బీహారులో, సంయుక్త రాష్ట్రాలలో వాలంటీరు దళాలు ఏర్పరుప బడినవి. మన ఆంధ్ర రాష్ట్రం అన్ని రాష్ట్రాలకంటే అన్యాయంగా ఉంది. మన రాష్ట్ర కాంగ్రెసు కమిటీ తక్కిన రాష్ట్రాలతో బాటు ముందుకు సాగాలి.

ఈ క్రింది పనులు వెంటనే చెయ్యాలి.

1. శాశ్వత వాలంటీరు దళాన్ని ఏర్పరుచుట.

2. మిలిటరీ బాండును యువకులక్కు ఉచితంగా నేర్పించుట. దీని వలన యువకులను బాగా ఆకర్షించవచ్చును. మిలిటరీ బాండు వాయిస్తోంటే వీరావేశం పుట్టు తుంది. ముసలివారైైనా సరే కదను తొక్కాలనే బుద్ధి పుట్టుతుంది.

3. ఆటలు, స్పోర్ట్సు, పోటీలు పెట్టి ప్రతి జిల్లాలోను యువకులను ప్రోత్స హించాలి. వ్యాయామ శాలలను పెట్టాలి.

4. కొండపల్లి, కొండవీడు మొదలైన చారిత్రిక ప్రఖ్యాతమయిన చోట్లకు పర్యటనాలకు యువకులను ప్రోత్సహించాలి. **(Excursions)**

5. యువకులలో అజ్ఞానాన్ని పోగొట్టుటానికి ప్రతి పట్నంలోనూ, ప్రతి గ్రామాలలోనూ పఠన మందిరాలు, పుస్తక భాండారాలు పెట్టుకొనటానికి యువకులను ప్రోత్సహించాలి.

6. చిన్న చిన్న రాజకీయ సాంఘిక నాటకాలను వేయించుట, మొదలైన వాటిని చెయ్యాలి.

7. మన ఆంధ్ర యూనివర్సిటీవారు **U. C. T.** ని ఏర్పాటు చేసేటట్లు మంత్రి వర్గము వారిచే వత్తిడి చేయించాలి.

8. కాలేజీ, స్కూళ్ళలో విద్యార్థులు తప్పకుండా ఆటలు మొదలగునవి ఆడేటట్లు **G, O** ను ప్యాసు చేయించాలి. ప్రతి పాఠశాలలోనూ ఆటల పరికరాలు తగినన్ని ఉంచేటట్లు గూడా చూడాలి.

9. నిర్బంధ ప్రాథమిక విద్యా విధానమును అమలులో పెట్టునట్లు మద్రాసు మంత్రి వర్గాన్ని ఒత్తిడి చెయ్యాలి.



సంవత్సరపు చందా 3—0—0
అర్ధ సంవత్సర చందా 1—10—0
విడి ప్రతి [24 పేజీలు] అణా
నవశక్తి కార్యాలయం, బెజవాడ.

నవశక్తి

END OF ISSUE